నమ్మలేని నిజాలు

పచ్చిక పర్వం
ప్రేమచినుకులతడి
చెదరని కళ్ళు.

మట్టి మనిషి
విశ్వవిజ్ఞాన జీవి
పంటల రైతు.

మత్తుకు పెగ్గు
వేస్తే పెగ్గుపైపెగ్గు
లివరు బొగ్గు.

వాన పోయెరా
నేలపేగు ఏడ్చెరా
బతుకెట్లరా.

శుభ శ్రావణం
జన భక్తి ప్రవాహం
పవిత్ర మాసం.



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

శ్రీనిజం

ఎవరైనా అనకండోయ్
వైద్యుల విద్యను పుత్తడి !
శ్రమను నివారించండోయ్
మెడికోలకు పని ఒత్తిడి !
సంకల్పమేటుపోతుంది
వైద్యుల గాలిస్తుంటే ?
హత్యలకు కారణమెవరు
తనువులు చాలిస్తుంటే ?



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 22-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:70 పేజిలు:68 వెల: రూ.1/-

## జమ్మూ కాశ్మీర్‌లో లోయలో పడ్డ బస్సు..

### ఇద్దరు మృతి.. 15 మందికి గాయాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: జమ్మూ కాశ్మీర్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ఒక బస్సు లోయలో పడిపోవడంతో ఇద్దరు మరణించారు. మరో 15 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటన జమ్మూ కాశ్మీర్‌లోని, ఉధంపూర్ జిల్లాలో బుధవారం ఉదయం 8.00 గంటల సమయంలో జరిగింది. బస్సు రాం నగర్ నుంచి పెచౌండ్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

బస్సు బసంత్‌గఢ్ తహసిల్ పరిధిలోని, గల్లి గాలా ప్రాంతంలో అతి వేగం కారణంగా అదుపుతప్పింది. దీంతో బస్సు పట్టు జారి కిందనున్న లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో బస్సు నుజ్జునుజ్జయింది. ఘటన గురించి సమాచారం అందుకున్న సహాయక బృందాలు ఘటనా స్థలికి చేరుకున్నాయి. రెస్క్యూ బృందాలు, సీనియర్ ఉన్నతాధికారులు, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల్ని రక్షించే పనులు చేపట్టారు. బాధితుల్ని బసంత్‌గఢ్‌తోపాటు, రాంనగర్‌లోని ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. వారికి చికిత్స అందుతోంది. మరో ఇద్దరు మరణించారు.

వారి మృతదేహాల్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ ఘటనపై కేంద్ర మంత్రి, ఉధంపూర్ ఎంపీ జితేంద్ర సింగ్ స్పందించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ప్రమాద స్థలానికి అంబులెన్సులు పంపించి సహాయక చర్యలకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ మార్గంలో రోడ్డు నిర్మాణం గురించి కూడా అధికారులతో చర్చించినట్లు వివరించారు. గత వారం కూడా ఇక్కడ రోడ్డు ప్రమాదం జరగగా.. 18 మంది గాయపడ్డారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

### ప్రజల రక్షణలో ప్రాణాలర్పించిన వీరుల సేవలు స్ఫూర్తిదాయకం

### అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ నివాళులు

సంగారెడ్డి, అక్టోబర్ 21:(నేటినిజం ప్రతినిధి):ప్రజల రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం సంగారెడ్డి జిల్లా పోలీసు పరేడ్ మైదానంలోని అమరవీరుల స్తూపం వద్ద వారు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన జంగయ్య (సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్), ఎల్లయ్య (సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్), సత్యనారాయణ (జిన్నారం పోలీస్‌స్టేషన్), సురేష్ (కంగ్టి పోలీస్‌స్టేషన్) ప్రజల రక్షణ కోసం చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో జరిగిన ఘటనలో పది మంది భారత పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

వారి త్యాగాల ఫలితంగానే ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించగలుగుతున్నారని పేర్కొన్నారు.

## భారత్, అమెరికా మధ్య త్వరలో కొత్త ట్రేడ్ డీల్: డోనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 21:కొత్త వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి భారత్, అమెరికా చాలా దగ్గరగా వచ్చినట్లు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

గతంలో కుదుర్చుకున్న ఒప్పందాల కన్నా ఇది భిన్నంగా ఉంటుందని అమెరికా అధ్యక్షుడు తెలిపారు. ఓవల్ ఆఫీసులో రిపోర్టర్లతో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

తమతో డీల్ కుదుర్చుకోవాలని భారత్‌కు ఉందని, మేం ఇక ఆ ఒప్పందం కుదుర్చుకుంటామని, ఆ అంశం చాలా దగ్గరపడిందన్నారు.

ప్రస్తుతం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇండియాలో పర్యటిస్తున్న నేపథ్యంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై రూబియా దృష్టిపెట్టారు. వాణిజ్యం, ఇంధనం, టెక్నాలజీ, రక్షణ రంగాల్లోనూ రెండు దేశాలు సహకారం అందించుకోనున్నాయి.

ఈ నెల మొదట్లో భారత వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్.. అమెరికా ట్రేడ్ ప్రతినిధులను కలిశారు. జేమిసన్ గ్రీర్ అనే వ్యక్తిని ఆయన అమెరికాలో కలిసిన విషయం తెలిసిందే.

ద్వైపాక్షిక వాణిజ్యానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ తొలి దశ వివరాలపై ఫిబ్రవరిలోనే రెండు దేశాలు ట్లాడుకున్నాయి.

అయితే పన్నుల విధింపులో అమెరికా మార్పులు చేయడంతో మరోసారి వాణిజ్య డీల్‌పై చర్చలు చేపట్టాల్సి వచ్చింది.

## అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

### పోలీసు శాఖలో 7,437 పోస్టుల భర్తీకి అనుమతి
### నేరగాళ్లతో ఫ్రెండ్లీగా ఉండొద్దు
### డ్రగ్స్ కట్టడిలో తెలంగాణ పోలీసులదే టాప్
### పోలీసుల సంక్షేమానికి పెద్దపీట
### అమరవీరుల త్యాగాలు మరువలేం
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 21:(నేటినిజం ప్రతినిధి): పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉన్నప్పుడే అభివృద్ధి వేగంగా సాగుతుందని పేర్కొన్నారు. సమాజ రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. 2028 నాటికి పోలీసు శాఖలోని అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు.



### అమరవీరులకు ఘన నివాళి

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని గోషామహల్‌లో నిర్వహించిన పోలీసు స్మారక పరేడ్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ఏడాది 155 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు చేస్తున్న సేవలు, త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులు, కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీసు శాఖ ఎప్పటికప్పుడు తన విధానాలను మెరుగుపరుచుకుంటోందని ప్రశంసించారు.

### 7,437 పోస్టుల భర్తీకి అనుమతి

పోలీసు శాఖను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు వెల్లడించారు. పోలీసు శాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చామని, మిగిలిన ఖాళీలను కూడా దశలవారీగా భర్తీ చేస్తామని చెప్పారు. 2028 నాటికి శాఖలోని అన్ని ఖాళీలను భర్తీ చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. 112 మంది డీఎస్పీలను ప్రత్యక్ష నియామక పద్ధతిలో నియమించినట్లు వివరించారు.

### అమరవీరుల కుటుంబాలకు అండగా..

పోలీసు సిబ్బంది సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భవిష్యత్తుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియాను హోదాను బట్టి కోటి రూపాయలకు పైగా పెంచినట్లు తెలిపారు. దేశానికి, సమాజానికి సేవ చేసిన పోలీసు సిబ్బందిని గుర్తించడంతోపాటు వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. పోలీసు ఉద్యోగుల పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రత్యేక పోలీసు పాఠశాలను ఏర్పాటు చేసినట్లు పునరుద్ఘాటించారు.

### డ్రగ్స్ కట్టడిలో పోలీసుల పనితీరు భేష్

యువత మత్తు పదార్థాలకు బానిసలవడం ఆందోళనకరమని ముఖ్యమంత్రి అన్నారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు డ్రగ్స్ నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ విషయంలో తెలంగాణ పోలీసు శాఖ పనితీరు అభినందనీయమని కొనియాడారు. ఉత్తమ పనితీరులో రాష్ట్ర పోలీసు శాఖ జాతీయ స్థాయిలో తొలి స్థానం సాధించిందని పేర్కొన్నారు.

### ఆహార కల్తీపై ఉక్కుపాదం

ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఆహార కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. టీజీ సేఫ్ కార్యక్రమం ద్వారా కల్తీకి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ట్రాన్స్‌జెండర్లకు బాధ్యతలు అప్పగించడం సాహసోపేత నిర్ణయమని పేర్కొన్నారు.

### నేరగాళ్ల పట్ల కఠినంగా ఉండాలి

ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరగాళ్లతో స్నేహంగా ఉండటం కాదని సీఎం స్పష్టం చేశారు. బాధితులు, సామాన్యులు, అమాయకుల పట్ల పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అదే సమయంలో నేరగాళ్లు, భూకబ్జాదారులు, డ్రగ్స్ అక్రమ వ్యాపారుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు భరోసా కల్పిస్తూ, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ, వారు ఆశించిన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజలందరి భాగస్వామ్యంతో సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు.

## ఒక్క గ్రాము యురేనియం కూడా మా దేశం నుంచి బయటికి వెళ్లదు : ఇరాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 21:పశ్చిమాసియా లో ఘర్షణలు ముగించేలా పాకిస్థాన్ .. అమెరికా-ఇరాన్ మధ్య రాయబారం కొనసాగిస్తున్నది. అయితే సంధిపై ముందుకు వెళ్లే క్రమంలో తమ షరతులను పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ కు ఇరాన్ స్పష్టంగా తెలియజేసింది. తాము శుద్ధిచేసిన యురేనియాన్ని వేరే దేశానికి తరలించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది.

శుద్ధి చేసిన యురేనియంలో ఒక్క గ్రాము కూడా ఇరాన్ నుంచి బయటకు వెళ్లదని ఇరాన్ జాతీయ భద్రతామండలి కార్యదర్శి మొహసెన్ రెజాయీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తమకు నమ్మకం కుదిరేలా అమెరికా చర్యలు తీసుకునే వరకు ఎలాంటి చర్చలు ఉండవని పేర్కొన్నారు. ఇరాన్ విధించిన అన్ని షరతులను నెరవేర్చడంతోనే ఆ చర్చల ప్రక్రియ ప్రారంభం కావాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. మధ్యవర్తిత్వం కోసం ఇరాన్ వెళ్లిన జనరల్ మునీర్‌కు కూడా మొహసెన్ ఇదే విషయాన్ని స్పష్టంచేశారు.

హర్మూజ్ జలసంధి విషయంలో ఎలాంటి గందరగోళ వైఖరి లేదని, అమెరికా తమ షరతులు అంగీకరించేంత వరకు హర్మూజ్ మూసే ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. గత హామీలను అమెరికా గౌరవించేవరకు కొత్తగా చర్చలు ఏమీ ఉండవని తేల్చిచెప్పారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

వరంగల్, అక్టోబర్ 21: దేశ రక్షణతోపాటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న అమరుల స్తూపం వద్ద పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి ఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

## పట్టుబడ్డ స్మగ్లింగ్ ముఠా.. భారీగా నగదు, బంగారం స్వాధీనం..!

అమరావతి, అక్టోబర్ 21: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నగరంలో బంగారం స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టయింది. విజయవాడ శివారులో డీఆర్ఐ అధికారులు తనిఖీలు చేస్తుండగా ఈ ముఠా దొరికింది. వాళ్ల నుంచి ఓ వాహనంతోపాటు బస్సులో అక్రమంగా తరలిస్తున్న విదేశీ కరెన్సీ, బంగారం పట్టుకున్నారు. వాటి విలువ సుమారు రూ.5.84 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతా మీదుగా హైదరాబాద్‌కు బంగారం తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

స్కార్పియో వాహనంలోని సీక్రెట్ డ్రాలో ఉన్న 60 వేల అమెరికన్ డాలర్లు, 21,500 యూరోల నగదును స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ వైపు బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు బంగారం క్యారియర్లను అరెస్ట్‌చేశారు. వారు నడుముకు కట్టుకున్న పౌచ్‌లో 3.147 కిలోల బంగారం తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో మొత్తం ఐదుగురిని పోలీసులు అరెస్ట్‌చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. హైదరాబాద్ యూనిట్, విజయవాడ రీజినల్ యూనిట్ డీఆర్ఐ అధికారులు సమన్వయంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. బంగారం స్మగ్లింగ్ ముఠాపై దర్యాప్తు కొనసాగుతున్నదని అధికారులు వెల్లడించారు.

చురక

తనను తాను తిరుగి
తరిస్తుండు మనిషి
చుట్టూరా విస్మరించి
చరిస్తుండు భ్రమసి.
సమాజమే వ్యక్తిగత
సమస్యల భూగోళం
ఊహల్లో నేల విడిచి
ఉరుకుటేల ఖగోళం



-వేల్పుల నారాయణ
9440433475

రాధశ్రీ రాగాలు

ఇనకులుడు "దాశరథి"
ఈద రానిది "శరధి"
అని చేయువాడు "రథి"
అనును రాధశ్రీ !!
ఉండ దగినది చెట్టు
ఉండ దగనిది తిట్టు
తెలుప రానిది గుట్టు
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

## కలం ఖడ్గంగా నిరంకుశత్వ పాలనను ఎదిరించిన షోయబుల్లా ఖన్-డా॥నాళేశ్వరం శంకరం




సభలో ప్రసంగిస్తున్న డా॥ నాళేశ్వరంశంకరం. వేదికపై కళా జనార్ధనమూర్తి,

హైదరాబాద్, అక్టోబర్ 21:(నేటినిజం ప్రతినిధి): నిజాం పాలనలో అణచివేత రజాకార్ల దుర్మార్గాలకు వ్యతిరేకంగా కలాన్ని ఖడ్గం చేసుకుని ఎదురించిన షోయబుల్లా ఖాన్‌కు తెలంగాణ చరిత్రలో శాశ్వత స్థానం ఉంటుందని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా షోయబుల్లా ఖాన్ యాదిలో సమావేశం జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా॥నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో జర్నలిజంలో పట్టా పొందిన షోయబ్ స్వయంగా ఇమ్రోజ్ దిన పత్రిక స్థాపించి నాడు రజాకార్ల దారుణాలు తన వ్యాసాల ద్వారా ప్రజలను చైతన్య పరచిన నిజాయితీ నిర్భయానికి ప్రతీకగా నిలిచారని చెప్పారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. మహనీయుల జీవితాలు గుర్తు చేసుకునే ప్రయత్నంలో వారి జన్మదిన తేదీలలో వీలును బట్టి యాదిలో పేరిట గానసభ తరచూ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. వేదికపై గాయని శ్రీదేవి సుందరవల్లి, సామాజిక కార్యకర్తలు వైషధం సత్యనారాయణ, పి.ఎస్.ఆర్.మూర్తి పాల్గొన్నారు.

## కవి ఉదారి నారాయణకు కాళోజీ అవార్డు



ఆదిలాబాద్ అక్టోబర్ 21: జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, పరిశోధకుడు డాక్టర్ ఉదారి నారాయణకు 2026 సంవత్సరానికి వరంగల్ కాళోజీ ఫౌండేషన్ వారు కాళోజీ స్మారక పురస్కారాన్ని ప్రకటించారు. ఈ అవార్డు క్రింద ఉదారి నారాయణకు రూ.10 వేల నగదుతో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేయనున్నారు. అవార్డును నవంబర్ 13న కాళోజీ వర్ధంతి రోజున వరంగల్‌లో అందజేస్తారు. ఇదివరకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్తు, వెన్నెల సంగమం, అలిశెట్టి ప్రభాకర్ స్మారక పురస్కారం అందుకున్నారు. కాళోజీ అవార్డు రావడంపై జిల్లా కవులు, రచయితలు, సాహితీ అభిమానులు, కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు
శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి పేరుతో స్థాపించిన




డా॥ పట్టాభి కళా పీఠము
(ప్రతిభకు పట్టాభిషేకం)
(రి. 234/2010)
ఫ్లాట్ నెం. ఎ/404, శివ గ్రీన్ వ్యాలీ, గోరంట్ల, గుంటూరు - 522 034.

ఆహ్వానము

డా॥ పట్టాభి జయంతి –
పట్టాభి అవార్డ్స్–2025 ప్రదానోత్సవ సభ
(సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకం)

తేది : 14-11-2026 (2వ శనివారం)
వేదిక : పెన్ననర్ల భవనం
తాలూకా కాంపౌండ్, బ్రాడీపేట, గుంటూరు.
సమయం : ఉదయం 10 గం॥లకు

సభా కార్యక్రమం
సభాధ్యక్షులు :
డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్
అధ్యక్షులు, డా॥ పట్టాభి కళాపీఠము
ముఖ్య అతిథి :
గౌ॥ శ్రీమతి పాడపాటి తేజస్విని గారు
అధ్యక్షురాలు, ఆం.ప్ర. సృజనాత్మక, సాంస్కృతిక సమితి, అమరావతి
విశిష్ట అతిథి :
ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు
ఉపకులపతి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్

భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం
గుంటూరు శేషేంద్రశర్మ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో



మహాకవి శేషేంద్ర శత జయంతి
ప్రారంభోత్సవం

తేది: 22 అక్టోబర్, 2026 గురువారం, సాయంత్రం 6:00 గం.లకు
వేదిక: రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్.

అధ్యక్షులు : డా॥ నందిని సిధారెడ్డి
కవి, విమర్శకులు, పూర్వ తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు
ప్రారంభోపన్యాసం : డా॥ ఏనుగు నరసింహారెడ్డి, IAS
డైరెక్టర్, భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
విశిష్ట అతిథి : డా॥ మండలి బుద్ధప్రసాద్, శాసనసభ్యులు, అవనిగడ్డ
వక్తలు : శ్రీ రజా హుస్సేన్, సీనియర్ పాత్రికేయులు, సాహితీ విమర్శకులు
ఆచార్య మాడభూషి శ్రీధరాచార్యులు, న్యాయశాస్త్ర కోవిదులు, మహీంద్రా స్కూల్ ఆఫ్ లా
డా॥ వెల్దండి శ్రీదర్, కవి, విమర్శకులు
శ్రీ బీరం సుందరరావు, కవి, విమర్శకులు
శ్రీ సబ్బని లక్ష్మీనారాయణ, కవి, విమర్శకులు
శ్రీ సంకేపల్లి నాగేంద్ర శర్మ, కవి, విమర్శకులు

సాత్యకి, కో-ఆర్డినేటర్ భాషా సాంస్కృతిక శాఖ

నేటినిజం
# సాహితీ కెరటాలు
website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 22-10-2026

## సప్త పదులు



ప్రక్రియా సృజనకర్త: సుధామ
సెల్:9849297958

ఆయుధాలు
అణ్వాయుధాలు

జమ్మిచెట్టు
పూజతో
నాశననీ
శత్రువులు-అవరోధాలు.
-కె. ఎం. కె. మూర్తి
సికింద్రాబాద్

దానాలు
వాగ్దానాలు

తమ
పనయ్యాక
పత్తా లేకుండా
అంతర్ధానాలు.
-ఋష్యశ్రీ, సారవకోట

జీతం
జీవితం

మనిషి బ్రతుకు
డబ్బుకు
సంసారానికే
అంకితం
-కపిలవాయి అశోక్ బాబు
హైదరాబాద్

నయనం
పయనం

నిద్ర మానవాళికి
కావాలి
మంచి
శయనం!
-డా.గన్నోజు శ్రీనివాసాచారి
మహబూబ్ నగర్

ఆచారము
గ్రహచారము

అనవసరంగా
మాటలు
పడుతుంటే
అది విచారము
-మన్నవ సుధాకర్
విజయవాడ

సంధానము
ప్రధానము

వివాహము
వైదిక
సంప్రదాయంలో
విశిష్ట విధానము.
-పుష్ప వేఙ్కటశర్మా
ఒడిశా.

గొప్పలు
కుప్పలు

అహం
ఎక్కువైతే
మనిషికి
తప్పవుగా తిప్పలు
-నీలాంజన

ప్రేమించాలి
ఆలోచించాలి

కోపం అసూయ
తగ్గించుకు
ఓర్పుతో
జీవించాలి
-బొగ్గవరపు
శ్రీమన్నారాయణ

పాలన
మేలన

అక్రమార్జన
విసర్జిస్తే
పేదరికం
అవుతుంది నిర్మూలన
-హైమ. కందుకూరి

# యువతకు ధైర్యం "స్ఫూర్తి శిఖరం"

పుస్తక సమీక్ష

దేశానికి యువశక్తి కీలకం ఆ యువశక్తి సన్మార్గంలో పయనించేలా చూడడం నేటి సమాజ అవసరం. ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి యువత కష్టపడాలి తమ విలువైన ఆలోచనలను పంచాలి. యువతను ఉత్తేజపరిచేలా కార్య సాధన జరగాలి. ప్రోత్సాహక మార్గాలు తెరుచుకోవాలి పదునైన సూచనలు అందించాలి. ముఖ్యంగా యువతలో సీరియస్ నెస్ పెరగాలి యువతకు ప్రతి పల్లెలో ఆదర్శవంతమైన వారు కనిపించాలి .యువతరం నిరాశ నిస్పృహలకు లోను కాకుండా గొప్పగా చదివే విధంగా ప్రోత్సాహం అందాలి .ఇది ప్రభుత్వంతో పాటు సమాజ బాధ్యత. ఎన్ని కష్టాలు నష్టాలు ఎదురైనా తమ లక్ష్యం సాధించాలన్న తపన పెరగాలి. మహనీయుల సూక్తి వాక్యాలను చదివి ఆచరణలో పెట్టాలి అప్పుడే చేయాల్సిన కర్తవ్యం బోధపడుతుంది. సాటివారిని పెద్దవారిని గౌరవించాలి. ఈరోజు సమాజంలో చెడు పెరిగిపోయింది. ఎక్కడ చూసినా చెడు యువతను ఎక్కువగా ఆకర్షిస్తున్నది .నైతిక విలువల పతనం తారాస్థాయికి చేరుకుంది. పుస్తక పఠనం తగ్గిపోతున్నది. ఒక పుస్తకం చదివితే ఒక జీవితాన్ని చదవవచ్చు పుస్తకం ఒక మంచి మిత్రుడు ఆ పుస్తకం మనకెన్నో విషయాలను నేర్పిస్తుంది. మహనీయుల మంచి నీతి వాక్యాలు మన జీవితాలను బాగుపరుస్తాయి కష్టాల్లో ఉన్న సమాధానం వెతికి చూపిస్తాయి. మనిషి జీవన గమనంలో పుస్తకం ఒక మార్గం. ఒక సమాధానం. మేటి పుస్తకాలను ఎంపిక చేసుకోవాలి అబ్దుల్ కలాం యువతకు ఎన్నో సూచనలు ఇచ్చారు. తన జీవితమే యువతకు ఆదర్శం. ఆ మహనీయుని బోధనలు ఎంతో విలువైనవి ఆయన గురించి అధ్యయనం చేయడం నేటి యువత బాధ్యత అబ్దుల్ కలాం గారు చెప్పిన విషయాలను కళాత్మకంగా కవితగా చెప్పగలిగితే మరింత సులువుగా విషయం బోధపడుతుంది. అలాంటి మేటి ఆలోచన ఒక యువకుడికి కలిగింది .అతడు అబ్దుల్ కలాం గారిని ఆయన రచనలను అధ్యయనం చేశాడు. స్వతహాగా కవి గనుక దేశంలో ఎవరూ చేయని సాహసం చేశాడు. తన మేధస్సును జోడించాడు కవితాత్మకతను రంగరించాడు సౌందర్యాన్నీ కూర్చాడు. సాహసం చేయడం నేర్చుకున్నాడు .ఎంతోమంది మేధావులను కలిశాడు .వారు పలికే మాటల్లోని విలువైన సమాచారం మదిలో నింపుకున్నాడు పుస్తకాలతో కుస్తీపట్టాడు. ఒక జ్ఞాన తపస్విలాగా మారాడు. ఆ జ్ఞానాన్ని పుస్తక రూపంలో తెచ్చి మనందరినీ ఆలోచింపజేస్తున్నాడు .ఆ బీద విద్యార్థి ఎన్నో కష్టాలను ఓర్చి మనందరినీ ఆశ్చర్యపరిచేలా సాహసం చేసి మనకు అందిస్తున్న నేటి సమాజానికి అవసర మయ్యే విలువైన జ్ఞాన సముద్రం లాంటి పుస్తకమే **"స్ఫూర్తి శిఖరం"**

ఎన్నో లోతైన భావాలు ఎన్నో గాంభీర్యమైన పదాలు ఎన్నో ఆలోచింపజేసే సత్యాలు మేధస్సును రంగరించే అక్షరాలు ఎన్నో జీవితాలను అనుభవిస్తే కానీ బోధపడని ఆలోచనలు ఒక తపస్వి తపస్సు పూర్తయిన తర్వాత పలికే వాక్యాలు స్ఫూర్తి శిఖరం పుస్తకంలోని ప్రతి కవిత ఒక అస్త్రం లాంటిది. ప్రతి కవితలో ఒక జీవితం ఉంది. ప్రతి వాక్యంలో ఎన్నో సందేశాలు ఉన్నాయి. యువత ,క్యారం శ్యాం కుమార్ కు ఆదర్శం .లక్ష్యం ఈ కవి నేర్పించే బోధన జ్ఞానం. ఈ కవి పరమార్థం .మనం ఎంతోమంది కదిలించే కవులను చూసాం. వారి కవితలను చదివాం. ఒక్కొక్కరిది ఒక్కో ప్రత్యేకత. అలాంటి మేటి పుస్తకాల సరసన ఈ యువకుని స్ఫూర్తి శిఖరం నిలుస్తున్నది.

స్ఫూర్తి శిఖరం ఈ పుస్తకానికి అక్షరాలా సరిపోయే శీర్షిక. ఈ పుస్తకంలో కదిలించి ఆలోచన రగిలించి కార్యోన్ముఖులను చేసే ఎన్నో కవితలు ఉన్నాయి. పుస్తకాలు ఎన్నో ఉన్నా మేటి పుస్తకాలుగా కొన్ని




ప్రతులకు:
క్యారం శ్యాం కుమార్
9441143848



మాత్రమే మిగులు తాయి. అలాంటి మేటి పుస్తకాల్లో ఒకటిగా నిలిచే పుస్తకం ఈ స్ఫూర్తి శిఖరం.

యువత కోసం ఒక యువకుడు పడిన సంఘర్షణ ఈ స్ఫూర్తి శిఖరం పుస్తకంలో కనిపిస్తుంది. ఎన్నో జీవితాల కోసం ఒక తపస్వి పడిన తపన, మేటి కవిత్వం కోసం ఒక యువ కవి మదనపడిన అక్షరాలు ఈ పుస్తకం నిండా ఉన్నాయి. ఒక్కొక్క పేజీ తిరగేస్తే ఒక్కొక్క జీవిత సత్యం మనకు బోధపడు తుంది .గుండెలకు హత్తుకునే భావాలు ఉత్సాహపరిచి నీతి బోధించే గురువు లాంటి అక్షరాలు ప్రతి కవితలో ఈ పుస్తకంలో కనిపిస్తాయి.

కవిత్వం ఏం చేయాలో కవిత్వ ఉద్దేశం ఏమిటో ఈ పుస్తకంలోని ప్రతి కవిత బోధిస్తుంది. ఈ పుస్తకంలోని మొదటి కవిత చదివితే చాలు ఈ పుస్తకం పూర్తిగా చదవాలనిపిస్తుంది **నిజమైన ఆనందం** అనే కవిత లో

**దృశ్యం**
**మబ్బుగా ఉండవచ్చు**
**కానీ లక్ష్యం కాదు**
**దశ**
**చెడ్డదిగా ఉండవచ్చు**
**కానీ**
**జీవితం కాదు**

ఒక్కొక్క మాట తూటాల పేలుతుంది. పుస్తకంలోని ఒక్కొక్క కవిత సందేశం మనసుల్లో దూసుకెళ్తుంది. ఇది యువతకు గొప్ప సందేశం .ఆలోచిస్తే ఈ సందేశం ఒక మహాసాగరం .ఆటం కాలు ఎన్నైనా ఆగక సాగడమే జీవిత పరమార్థం. యువత ఈ పరమార్థం తెలుసుకోవాలి.

ఇంకో కవితలో **అద్దం నీ స్నేహితుడు** అంటాడు

**మీరు**
**ఏడ్చినప్పుడు**
**అద్దం**
**ఎప్పుడూ నవ్వదు**

యువత నిరాశ నిస్పృహలకు లోను గాకుండా ప్రతి వాక్యంలో ఉత్సాహపరిచే కవితా పంక్తులు జీవిత సత్యాలుగా ఆవిష్కరించిన తీరు కవి క్యారం శ్యాం కుమార్ జ్ఞాన ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

కష్టాలు ఎదురయినంత మాత్రాన నిరుత్సాహపడి ఆగిపోదామా వాటిని సవాలుగా తీసుకొని ముందుకు సాగితే విజయాల విలువ తెలుస్తుంది. అందుకే **స్వయంకృషిని నమ్ముకుంటే** అనే కవితలో

**అదృష్టంతో**
**పైకి వచ్చిన వాడికి**
**చెట్టు ఎక్కడం**
**మాత్రమే తెలిసి ఉంటుంది**
**అదే.....**
**స్వయంకృషితో**
**పైకి వచ్చిన వాడికి**
**చెట్టు ఎక్కడం**
**చెట్టు దిగడం**
**రెండు తెలిసే ఉంటుంది.....**

ఆకలితో ఉన్నవారికి గుప్పెడు అన్నం, ఆపదలో ఉన్నవారికి తోచిన సాయం, బాధలో ఉన్నవారికి కొంచెం ఓదార్పు, అందించడమే మానవత్వం. కానీ అన్నీ తెలిసిన మనం అహం ప్రదర్శిస్తుంటాం. ఈ విషయమే కవి తెలుపుతూ స్వార్థం వదిలిపెట్టమంటాడు

**ధనం ఉంటే**
**ధనవంతుడు అవుతాడు**
**అదే**
**దానం చేస్తే**
**భగవంతుడు అవుతాడు**
**అలాగే నిన్ను సాధించడం కష్టం**

**అనే కవితలో**

**కష్టాలకు**
**కూడా తెలియాలి**
**నిన్ను సాధించడం**
**కష్టమని .....**

అదేవిధంగా **పుడుతుంది** కవితలో

**ఆవిష్కరణకు**
**సరైన వయస్సు**
**ఉండదు**
**ఆలోచన పుట్టగానే**
**ప్రపంచాన్ని మార్చే**
**శక్తి పుడుతుంది.** అంటాడు కవి

కవి చెప్పినట్టుగానే ఈ పుస్తకం ఆలోచన ఒక ప్రభంజనం. తలెత్తిన ప్రతి ప్రశ్న ఒక మార్గానికి దారి. నవ యువత తడబడక ఆలోచనల తేజంతో ముందుకు సాగాలి. అలాగే అగ్నిపరీక్ష అనే కవితలో

**భయాన్ని**
**చూసి**
**వెనకడుగు**
**వేయకు.**
**అది నిన్ను**
**ఆపే గ్రహణం కాదు**
**నిన్ను**
**మెరిపించే**
**అగ్నిపరీక్ష**
**మాత్రమే.......** అంటాడు కవి

ఇలా ఈ పుస్తకం నిండా యువతకు స్ఫూర్తినిచ్చే సందేశాలు ఎంతో కదిలిస్తాయి. ఈ పుస్తకం చదివితే యువత గమ్యం ఏమిటో తెలుస్తుంది. నిరాశ నిస్పృహలు దూరం చేసి చైతన్యవంతుల్ని చేస్తుంది. పట్టుదలను పెంచుతుంది పరిస్థితులకు ఎదురు నిలబడే ధైర్యాన్ని అందిస్తుంది. యువతకు బాసట ఈ పుస్తకంలోని అక్షరాలు. సామాన్యుడి తోడు ఈ పుస్తకంలోని వాక్యాలు.

కవి క్యారం శ్యామ్ కుమార్ నిత్య పోరాట సంఘర్షణ లోంచి ఉద్భవించిన ఈ కవితలు ప్రభంజనం సృష్టిస్తు న్నాయి. ఈ పుస్తకాల్లోని అక్షరాలు చైతన్యం నిండి రెపరెపలాడుతున్నాయి. ఆలోచనలు అయ్యి మార్గ దర్శనం చేస్తున్నాయి. ప్రతి ఒక్కరి మననును కదిలిస్తున్నాయి. క్యారం శ్యామ్ కుమార్ అబ్దుల్ కలాంను మనస్సు నిండా నింపుకున్నాడు .ఆ మహా జ్ఞాన తపస్విని అధ్యయనం చేశాడు .ఆయన ఆదర్శా లను కదిలించే కవితలను చేశాడు. యువతతోనే ఆదర్శ సమాజం సాధ్యమని నమ్మి యువతే తన కవిత వస్తువుగా మలిచాడు. ఇదొక మహా కావ్యం .నేటి సమాజానికి అవసర మయ్యే గ్రంథం. ప్రతి యువకుడి చేతిలో ఉండాల్సిన పుస్తకం. ప్రతి ఇంట్లో అందరూ చదవదగిన పుస్తకం.

ఈ పుస్తకంలో సుమారు 400 కవితలు ఉన్నాయి. ఇది ఒక సుదీర్ఘ కవితా సంపుటి క్యారం శ్యాం కుమార్ బీద విద్యార్థి అయినప్పటికీ ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని ఎం ఎస్ సి ఎమ్మెస్ డబ్ల్యూ ఎంఈడి లాంటి ఉన్నత చదువులను చదివిన వాడు ఈ పుస్త కంలోని ప్రతి కవిత ఆలోచింపజేసేది గా ఉంది. ఈ పుస్తకం ప్రతి గ్రంథాలయ గుండెను తప్పక తాకుతుంది .చిన్న వయసులోనే గాడత కలిగిన కవితలను సృష్టించి అందరినీ ఆలోచింపచేస్తున్న ఈ యువ కవి. మొదటి పుస్తకం తోనే ప్రభంజనం సృష్టిస్తున్న ఈ జ్ఞాన కళాతపస్విని అభినందిస్తూ ఈ పుస్తకాన్ని అందరూ చదివి అందరిచే చదివిస్తారని ఆశిస్తున్నాను.



-సిరిసిల్లా
గఫూర్ శిక్షక్
9849062038

# అనితా(ంత)రంగం ఈ ఆలోచన ప్రవాహం

మన చుట్టూ అనేక సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. ఆ సంఘటనలను కొందరు మామూలుగానే చూస్తుంటారు. మరి కొందరు కాస్త మనిస్తూ వారి పని వారు చేసుకుంటూ వెళ్తుంటారు. కొందరు మాత్రమే ఆ సంఘటనల పట్ల స్పందిస్తుంటారు. అవసరమైతే వాటిని అక్షరంలోకి వొంపి కవితనో, పాటనో, కథనో లేదా ఏ వ్యాసంగానో మలిచి వాటిలోని మంచి చెడుల పట్ల సమాజానికి ఒక ఎరుకను కలిగిస్తారు. అట్లా వివిధ సందర్భాలలో తను స్పందించిన స్పందనలను అక్షర రూపాన్నివ్వడానికి పరితపించే ప్రయత్నం కొనసాగిస్తున్నది కాంచనపల్లి అనితారాణి. అలా కొనసాగించిన వాటన్నింటిని **'ఆలోచన ప్రవాహం'** పేరుతో తన మొదటి వచన కవితా సంపుటిని సాహితీ లోకంలోకి తెస్తున్నది.

మనిషి నిరంతరం తన మనసులో అనేక ఆలోచనలతో ప్రవహిస్తుంటాడు. అవి జ్ఞాపకాలు కావచ్చు. వివిధ సంఘటనలు పట్ల కలిగే భావోద్వేగాలు కావచ్చు. ఇంకేమైనా కావచ్చు. ఈ ఆలోచన ప్రవాహం ఒక నియంత్రణలేని అంతర్గత సంభాషణ లాంటిది. అలాంటి సంభాషణతో అనితారాణి తన అక్షరాలను కవితలుగా మార్చే ప్రయత్నం చేసింది.

**"సముద్రమంతా వేదన/ఆకాశమంత ఆవేదన/ అగ్నిలా దహిస్తున్నా/సుడిగాలిలా చుట్టినా/ భూమాతల భరించాల్సిందే/ నిలకడగా నిలిచి గెలిచి/ నీవేంటో నిరూపించాల్సిందే"** (పుస్తకం తెలుపు-అక్షరాలు నలుపు)

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియదు. అట్లాంటి సందర్భంలో పచ్చగా ఉండాల్సిన జీవితం ఒక్కసారిఆ మూణ్ణాళ్ళ ముచ్చటైతే ఎంత బాధాకరమో అది అనుభవిస్తున్న వారికే అర్థ మవుతుంది. అయినా చిరునవ్వు తో, ఆత్మ విశ్వాసంతో జీవిత పడవను ముందుకు నడపాల్సిందే అనే పట్టుదలతో పాటు తనలో అనేక వేదనలు అగ్నిలా దహిస్తు న్న ఏమాత్రం చలించకుండా గెలవాలని, గెలిచి నిలబడాలనే పోరాటపటిమ ఈ కవయిత్రిలో కనబడుతుంది.

మనిషి మాట్లాడే మాటలు, ఆ మాటల వెనుక దాగి ఉన్న ఆంతర్యాలు, నిజ నిజాలు ఏంటో కవయిత్రికి బాగా తెలుసు. అందుకే **"కొన్ని మాటలు పెరుగన్న మూటలు, పూల బట్టలు/ కొన్ని మాటలు మంటలు, గుండెల్లో కుంపట్లు..."** అంటూ నిర్భయంగా చెప్పింది.

ఒక్కోసారి కొన్ని మాటలు జీవితాన్ని చిన్నాభిన్నం చేసినా కొన్ని మాటలు మాత్రం తనలో విశ్వాసాన్ని నింపి మనిషిగా తీర్చిదిద్దాయనే సత్యాన్ని కూడా వెలిబుచ్చింది.

**"నేను ఒక అగ్ని శిలను/నీలో దోషపూరిత భావనలు ఉంటే/ నా మాట తేనెల ఊట, అమృతపు మూట/ నీ అంతరంగం విష జ్వాలలు చిందకుంటే..."** అంటే తన అంతరంగాన్ని స్పష్టంగా ప్రకటించింది. అంతేకాదు, రాజకీయ అవకాశవాదుల, పురుష అహంకార లోకంలో ఇమడ లేక స్త్రీ జాతికి మరో లోకం కావాలంటూ ఆవేదనతో నినదిస్తున్నది కవయిత్రి. **'మతం-అభిమతం'** అనే కవితలో మతం అంటే మానవత్వాన్ని నిర్వచించేది, నచ్చిన దారిలో వెళ్ళేది. నమ్మకం కొరకు నడిచేది అంటూ తన అభిమతాన్ని చాలా చక్కగా వ్యక్తీకరించింది.

యాభైకి పైగా కవితలు ఉన్న ఈ సంపుటిలో దాదాపు అన్ని కవితలు వచనంగా కొనసాగిన అవి సమాజం, మనుషుల పట్ల కవయిత్రికి ఉన్న ఒక దృక్పథాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. సున్నితత్వంతో పాటు, తన ధిక్కారం కూడా ఈ అక్షరాల్లో కనిపిస్తున్నది. దివ్యాంగులు,, అనాథల పట్ల తన చూపు స్పష్టమవుతుంది. ముఖ్యంగా సమాజంలోని స్త్రీల అసమానతలు, స్వేచ్ఛ పట్ల ఆవేదన, ఆక్రోశం మెండుగా కనబడుతుంది.

కవయిత్రికి ఇది మొదటి సంపుటి. ఎవరికైనా ఈ సందర్భంలో కాస్త తడబాటు పడడం సహజం. వస్తువు, నిర్మాణం, శైలి తదితర అంశాల పట్ల ముందు ముందు చాలా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. కవిత్వం అంటే కేవలం అక్షరాల కలయిక కాదు.

భావాలను, ఆలోచనలను, అనుభూతులను ఒక లయాత్మకంగా వ్యక్తీకరించేదే కవిత్వం. అలాంటి కవిత్వాన్ని తన 'ఆలోచన ప్రవాహం'లా ముందు ముందు చాలా శక్తివంతంగా సృష్టించాలని కోరుకుంటూ అనితారాణికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



-బిల్లా
మహేందర్
సెల్: 9177604430






ప్రతులకు:
కాంచనపల్లి
అనితరాణి,
ఇ.నెం.16-9-253/7/సి,
టీచర్స్ కాలనీ పుప్పాలగుట్ట,
చింతలబ్రిడ్జి దగ్గర
వరంగల్506 002
సెల్: 96761 15740

కాంచనపల్లి అనితారాణి రచించిన **'ఆలోచనా ప్రవాహం'** పుస్తకానికి బిల్లా మహేందర్ రాసిన ముందుమాట.

# కౌమార క్రిటిక్కులు-3




అందరం బిర్యానీలు భోంచేయటం పూర్తయింది. తర్వాత మిస్టర్ క్లీన్ బయటకు వెళ్లి ధూమపానం ముగించుకుని వచ్చారు.

"లెట్స్ స్టార్ట్! రచన అనేది ఓ ప్రోడక్టే. అది సినిమా కావచ్చు, ఇంకేదైనా కళారూపం కావచ్చు. దానికి ఖర్చు అవుతుంది. అలాగే పెట్టుబడి వెనక్కి రావాలి. అప్పుడు మరో ప్రోడక్ట్ తయారవుతుంది. కాబట్టి ఎవరికి వారు ప్రచారం చేసుకోవాలి. అందులో అనేక పద్ధతులు. కాబట్టి ఈ ఫోటోలు, ఎక్స్పోజింగ్ లు ఇవన్నీ పక్కన పెడదాం. ఎవరి విజ్ఞతకి వారిని వదిలేద్దాం. అన్య అన్నట్లు పాఠకులకు రచనే ప్రధానం. ఈ ఫోటోలు ఎల్లకాలం ఓ రచనను ప్రమోట్ చేయలేవు. అది నిర్వివాదాంశం" అని విశ్లేషించారు. తర్వాత...

"ఇంకొంతమంది వున్నారు. వారు రకరకాల ఉద్యోగాలు చేస్తారు. లంచాలు ఇస్తారు. పుచ్చుకుంటారు. అయితే వారి మనసులు మాత్రం విశాలం. వారిలో కొందరు క్రిటిక్ లు వుంటారు. అలాగే ఫామ్ హౌస్ లు కట్టించుకుంటారు. అందులో పార్టీలు ఏర్పాటు చేస్తుంటారు. వారిలో కళాపోషణ వుంటుంది. వారికి సంగీతం, ఆర్ట్, భావుకత, గడిచిపోయిన యవ్వనపు జ్ఞాపకాలు, విఫలమైన ప్రేమలు, అస్తిత్వాలు వుంటాయి. వారు కూడా ఒకటి, రెండు పుస్తకాలు తీసుకురావాలనుకుంటారు. అవి చాలా అందంగా, ఖరీదుగా డిజైన్ చేసుకుంటారు. అలాంటివి డిజైనర్ పీసులు.

వాటిని మామూలు ప్రోడక్టుల్లా అమ్మాలనుకోరు. అవి పెద్ద పెద్ద భవనాల లైబ్రరీల్లో మాత్రమే వుంటాయి. ఇలాంటి వాటికి కూడా సమీక్షలు రాయటానికి కొంత మందిని సెలెక్ట్ చేసుకుంటారు. అఫ్ కోర్స్, ఇంకొందరు అందులో తాము వుండాలని తమ జ్ఞాన ప్రదర్శన చేస్తారు" అని ఆగాడు.

"అలాంటి మహానుభావుల గురించి ఇప్పుడు మనకు అవసరమా?" అన్నాను.

"మేంగో! మనం క్రిటిసిజం గురించి మాట్లాడుకోవాలనుకున్నప్పుడు అన్ని కోణాలను టచ్ చేయాలి. ఇప్పుడు మనం మామూలు ప్రొడక్టుల గురించి మాట్లాడుకుంటే... ఇన్ని వందల, వేల ఉత్పత్తులు వస్తుంటే, ఆ సమాచారం కావాలి. అయితే పత్రికలు అంత స్పేస్ ఇవ్వలేవు. సమీక్షలు ఎప్పుడూ ఇన్ఫర్మేటివ్ గా క్లుప్తంగా ఉంటాయి. ఇక రెండవది, ఏ ఒకరో ఇద్దరో తప్ప ఈ సమీక్షలకు డబ్బులు ఇవ్వరు. ఈ మధ్యకాలంలో ఒక్కో పుస్తకం మూడు వందల పేజీల నుండి ఐదారు వందల పేజీల వరకు వుంటున్నాయి. అంత సీరియస్ గా చదవటానికి ఎవరికి సమయం వుంది? అందువల్ల సమీక్ష లేదా విమర్శ అంటే ఒక వ్యవస్థగా ఏర్పాటు చేసుకోవడం. కొంతమంది ఈ సమీక్షల కోసమే సంచికలు తెస్తుంటారు."

"అంటే ఈ స్పేస్ అనేది కథలను, కవిత్వాన్ని, సాహిత్యాన్ని నడిపిస్తోందా?" అన్నాను.

"అందులో అనుమానం అవసరం లేదు. ఒకప్పుడు నిడివి అంత సమస్య కాదు. ఇప్పుడు ఏ ప్రక్రియకైనా కచ్చితంగా ఇన్ని లైన్లు, ఇన్ని పేజీల్లో వుండాలని నియమాల్లో చేర్చుతున్నారు. దానికి మించి వుంటే పక్కన పెడతారు. ఇంకా మీలాంటివారిని క్రిటిక్స్ గా మారమంటున్నారంటే, అక్కడ ఎన్ని ఖాళీలు వున్నాయో మీకు అర్థమైందిగా!" అన్నాడు మిస్టర్ క్లీన్.

"మేమైతే ఒప్పుకోలేదు. లోకం బయటకు ఏమీ అనకపోవచ్చు గాని లోలోపల నవ్వుకుంటారు కదా! కథలు, కవిత్వాలు ఇప్పుడే మొదలుపెట్టినవారు ఈ కొత్త అవతారంలోకి ఎందుకు మారిపోతున్నారో కొంచెం క్లారిఫై చేయండి" అన్నాను నేను.

"అందుకు అనేక కారణాలు పిల్లలూ! మీకు ఇంకా కీర్తి కండూతి పట్టలేదు. మాకు తెలిసింది చాలా తక్కువ అని మీరు గుర్తించారు. అది వారికి గ్రహింపుకి రాలేదు.

ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట మన పేరు కనిపించాలి అనే తాపత్రయం. అదే కథలో, కవిత్వమో అంటే వందల మంది రాస్తుంటారు. అక్కడ పెద్ద పోటీ వుంది. ఇది వరకైతే స్పేస్ ఫిల్ చేయటానికి కథలు, కవిత్వం వేసేవారు. బహుమతులు ఇచ్చేవారు."

"బహుమతులు కూడానా?" అంది అన్య.

"అలాంటివి పెడితేనే కదా ఉప్పెనలా రచనలు వచ్చి పడేది! అందులో నుండి సంవత్సరానికి సరిపోయేంత సరుకు స్టోర్ చేసేవారు. ఆ బహుమతి ప్రకటనలు లేకపోతే చాలామంది రాయరు. పిల్లలూ, మీకు ఇంకో విషయం తెలుసా? ఈ బహుమతులకు కథలు రాసేవారు ఒక్కదానితో ఆగరు, పదులకొద్దీ పంపే కుటుంబాలు వున్నాయి!"

"అదేదో మహేష్ బాబు సినిమాలో, 'మీ కుటుంబం కుటుంబం ఉప్మా తినే బతికేస్తున్నారా?' అన్నట్లు, ఇక్కడా అలాంటివి వున్నాయా?" అన్నాడు విదూ.

"వుంటాయి నాయనా! ఏక వ్యక్తి సైన్యంలా, వారికి దీటుగా ఒక్కరే వందలూ, వేలూ రాయగలవారు వున్నారు. అలాగే ఇన్ని పుస్తకాలు రావటానికి కారణం వీరికి బహుమతులు ఇవ్వటం కూడా! ఇదివరకు కొంతమంది మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు ఏ మండలానికి ఆ మండలం వారు, జిల్లా వారు, రాష్ట్రం వారు, కులం, ఉపకులాల వారు, మతం వారు ఇచ్చుకుంటారు, పుచ్చుకుంటారు. ఇదో మహామాయా ప్రపంచం పిల్లలూ!" అన్నారాయన.

"ఇవన్నీ మాకు తెలుస్తున్నాయి. అయితే మాకు తెలుస్తున్నది గోరంత మాత్రమే అని మీలాంటి వారితో మాట్లాడుతుంటే అర్థమవుతోంది" అన్నాను.

"మేంగో! ఒకప్పుడు సామాజిక ప్రయోజనం, సా.స్పృ. అంటే సామాజిక స్పృహ, ఇలాంటి పదాల మీద గొడవలు, చర్చలు జరిగేవి. ఇప్పుడు ఒకటే స్పృహ. ఎవరు ఏ క్యాంపు? ఏ ప్రాంతం? ఎవరి పేరు కింద ఎన్ని అవార్డులు వున్నాయి? ఇవన్నీ ఎవరో ఇవ్వటం ఏమిటి, మనకి మనం ఇచ్చుకుందాం, మనల్ని మనం ప్రమోట్ చేసుకుందాం అన్నది వచ్చాక... అంటారు కదా - మంది ఎక్కువ అయితే మజ్జిగ పల్చబడుతుంది అని. అలా సాహిత్యం పలచబడింది. మనం ఇంకా మాట్లాడుకోవాల్సిన విషయాలు చాలా వున్నాయిలే" అని వాచ్ చూసుకున్నారు.

"నిష్క్రమిస్తున్నారా?"

"బిర్యానీ ఏదో తేడా చేసింది రా. చాయ్ తాగుదాం. సరే, ఇప్పుడు మీరు మనసుని కంట్రోల్ చేసుకుని క్రిటిక్ అవతారం ఎత్తాలి అనుకుంటున్నారా? అది చెప్పండి. సాయంకాలం నేనో సభకి హాజరు కావాలి" అన్నారాయన.

"ఉన్న అవతారాలు చాలు గురూజీ! మేం కొత్త అవతారాలు ఎత్తనవసరం లేదు.

ఈ పుస్తకాలను అర్థం చేసుకునేంత జ్ఞానం మాకు లేదు. ముఖ్యంగా ఈ కవిత్వ పుస్తకాల్లో కవిత్వం చూస్తుంటే బతుకు మీద విరక్తి పుడుతోంది. అందుకని కొంతకాలం వీటికి దూరంగా వుందామనుకుంటున్నాం" అన్నాను.

"అవున్రా పిల్లలూ! మనసుల మీద పడే ప్రభావాలు జీవితాంతం వుంటాయి. దరిద్రపు పుస్తకాలు చదివి మనసుల్ని మలినం చేసుకోవద్దు. మాకంటే అలవాటయ్యాయి. వేం హంస లాంటివాళ్ళం... పాలు తాగి నీళ్ళు వదిలేస్తాం" అన్నారు.

"మేం కూడా ఆ స్థాయికి ఎదగాలని దీవించండి!"



- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

# మయూరపు రెక్కల్లో కవిత్వ తాత్త్విక దర్శనం



-సబ్బని లక్ష్మీ నారాయణ
8985251271



మయూరం అంటే నెమలి. భారతీయ సాహిత్య, సాంస్కృతిక సంప్రదాయాల్లో నెమలి కేవలం ఒక పక్షి కాదు. అది సౌందర్యానికి, వర్షఋతువు పరవశానికి, నూతన చైతన్యానికి, శృంగార భావనకు, ఉల్లాసానికి ప్రతీక. నెమలి పురివిప్పినప్పుడు ప్రకృతి తన సౌందర్యాన్ని తానే ఆవిష్కరించుకున్నట్లుంటుంది. అయితే మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ కవిత్వంలో మయూరం ఈ సహజ సౌందర్య పరిమితిని దాటి, కవి అంతరంగానికి, స్వేచ్ఛాకాంక్షకు, సృజనాత్మక చైతన్యానికి, సౌందర్య స్పృహకు, సామాజిక ధర్మాగ్రహానికి ప్రతీకగా నిలుస్తుంది.

శేషేంద్ర రచించిన 'నేను నా నెమలి' (Me and My Peacock) అనే కృతి 1975లో తెలుగు, ఇంగ్లీషు భాషల్లో వెలువడింది. అనంతరం అది ఆయన విస్తృత కవితా ప్రణాళికలో భాగంగా 'ఆధునిక మహాభారతం'లో 'మయూర పర్వము'గా స్థానం పొందింది. ఈ పర్వం ఒక కవి తనను తాను చూసుకునే అద్దం మాత్రమే కాదు; తన కవిత్వాన్ని, తన కాలాన్ని, తన సమాజాన్ని, తనకు పూర్వం ఉన్న మహాకవులను, ప్రకృతిని, మరణాన్ని, సాహిత్య శాశ్వతత్వాన్ని ఒకేసారి దర్శించుకునే తాత్త్విక కవితా ప్రపంచం.

'మయూర పర్వము'లో ప్రకృతి-సౌందర్యం-ఆత్మచైతన్యం-సామాజిక ధర్మాగ్రహం-మానవత-కవి కవిత్వం ద్వారా పొందే శాశ్వత స్థానం-విశ్వసాహిత్య సంబంధం-కవి-ప్రకృతి ఏకత్వం వంటి అనేక అంశాలు పరస్పరం ముడిపడి ఉన్నాయి. అందువల్ల ఇది కేవలం మయూరం ప్రతీక చుట్టూ తిరిగే కవిత్వం కాదు; కవి అంటే ఎవరు? కవిత్వం ఎందుకు? కవి సమాజంతో ఏ సంబంధం కలిగి ఉండాలి? మరణానంతరం కూడా కవి తన కవిత్వం ద్వారా ఎలా జీవిస్తాడు? ప్రకృతిలో కవికి ఉన్న స్థానం ఏమిటి? అనే ప్రశ్నలకు శేషేంద్ర తన కవిత్వం ద్వారా అందించిన తాత్త్విక సమాధానం దొరుకుతుంది. 'మయూర పర్వము' తొలి సర్గ ఒక విశిష్టమైన ముక్తకంతో ప్రారంభమవుతుంది:

**"సూర్యుడు ఎన్నో ఇతివృత్తాలతో చేసిన ఒక వృత్తం**
**మనిషి ఎన్నో రంగుల గాలిపటాలు**
**ఇరుక్కుని వేలాడే సంక్రాంతి వృక్షం**
**సుఖం బాణం తప్పించుకుని పారిపోతున్న హరిణం**
**లోకం మనిషి సృష్టించుకునే స్వప్నం?"**

ఈ ముక్తకంలో సూర్యుడు-మనిషి-సుఖం-లోకం అనే నాలుగు జీవన సత్యాలను శేషేంద్ర ప్రతీకాత్మకంగా ఆవిష్కరించాడు.

**"సూర్యుడు ఎన్నో ఇతివృత్తాలతో చేసిన ఒక వృత్తం"** అనే వాక్యంలో సూర్యుడు కాలగమనానికి, జీవన చక్రానికి, అనుభవాల నిరంతర ప్రవాహానికి ప్రతీక. సూర్యుని చుట్టూ కాలం తిరుగుతున్నట్లే, మనిషి జీవితం అనేక ఇతివృత్తాలతో ఒక సమగ్ర వృత్తంగా రూపుదిద్దుకుంటుంది.

**"మనిషి ఎన్నో రంగుల గాలిపటాలు / ఇరుక్కుని వేలాడే సంక్రాంతి వృక్షం"** అనే రూపకం మరింత లోతైనది. సంక్రాంతి గాలిపటాలు ఆనందం, ఆశ, ఆకాంక్ష, స్వేచ్ఛలకు ప్రతీకలు. కానీ అవే గాలిపటాలు చెట్టుకొమ్మల్లో చిక్కుకుని వేలాడినప్పుడు స్వేచ్ఛను కోల్పోతాయి. మనిషి జీవితంలో కోరికలు, సంబంధాలు, బాధ్యతలు, అనుభవాలు, ఆశలు, భయాలు కూడా అలాంటి రంగురంగుల గాలిపటాలే. వాటిని ఎగరేస్తూ చివరకు వాటిలోనే తాను చిక్కుకుపోయే జీవి మనిషి.

**"సుఖం బాణం తప్పించుకుని పారిపోతున్న హరిణం"** అనే రూపకం సుఖం యొక్క అందనితనాన్ని సూచిస్తుంది. సుఖం కోసం మనిషి నిరంతరం పరుగెడతాడు; కానీ అది చేతికి చిక్కేలోపే మరో దిశకు పారిపోతుంది. సుఖాన్వేషణే మానవ జీవితంలోని అంతులేని పరుగుగా ఇక్కడ కనిపిస్తుంది.

**"లోకం మనిషి సృష్టించుకునే స్వప్నం"** అనే చివరి వాక్యం ఈ ముక్తకానికి తాత్త్విక శిఖరం. మనిషి తన ఆలోచనలు, ఆశలు, భయాలు, అనుభవాలు, ఊహలతో తన చుట్టూ ఒక ప్రపంచాన్ని నిర్మించుకుంటాడు. ఈ విధంగా శేషేంద్ర వాస్తవం-స్వప్నం మధ్య ఉన్న సరిహద్దును ప్రశ్నిస్తాడు.

ప్రకృతి సౌందర్యం -కవిత్వానికి తొలి ప్రేరణ

శేషేంద్ర కవిత్వంలో ప్రకృతి కేవలం దృశ్యమాత్రం కాదు; అది కవిత్వానికి ప్రేరణ, భావానికి భాష, సౌందర్యానికి ప్రతీక. ఆయన ప్రకృతిని చూస్తాడు; అంతకంటే ముఖ్యంగా ప్రకృతిలోని సౌందర్యాన్ని తన అంతరంగంలోకి ఆహ్వానించి కవితగా మలుస్తాడు.

అందుకు ఈ పంక్తులు చక్కని ఉదాహరణ:

**"మళ్ళీ వచ్చింది కోకిల తోటల్లో తిరిగే శోకిల**
**తెచ్చింది పాథేయంగా ఒక మూట**
**ఈ బాటసారికి ఒక తియ్యటి పాట?**
**ఎంత అందంగా పూచాయి ఈ అడవిచెట్లు**
**గిరుల కురుల్లో గోవేధికాలు కురిశెట్లు."**

కోకిలను "బాటసారికి తియ్యటి పాట" అనే పాథేయాన్ని తీసుకొచ్చే సౌందర్యదూతగా శేషేంద్ర చిత్రించాడు. అడవిచెట్ల పుష్పాలను "గిరుల కురుల్లో గోవేధికాలు కురిశెట్లు" అనడం ద్వారా పర్వతాల నల్లని కురులపై ఎర్రని పుష్పాలు అలరారుతున్నట్లు మెరుస్తున్న దృశ్యాన్ని సృష్టించాడు. "కోకిల-శోకిల", "మూట-పాట" వంటి ప్రాసలు ఈ కవితా భాగానికి మాధుర్యాన్ని, లయాత్మకతను అందిస్తున్నాయి. ఇక్కడ ప్రకృతి దృశ్యం క్రమంగా శ్రావ్యమైన కవితా దృశ్యంగా మారుతుంది.

కవి హృదయం - యుగానికి జెండా

రెండో సర్గలో కవి తన హృదయాన్ని ఒక జెండాగా ఆకాశంలో ఎగురవేస్తాడు:

**"ఇప్పుడు నా హృదయాన్ని ఆకాశవీధుల్లోకి ఎగరేసి**
**నన్నొక జెండాగా ప్రతిష్ఠించుకున్నాను**
**అదుగో చూడండి గాలుల్లో ఎగురుతున్న ఆ రంగుల పేలిక!**
**అది ఈ యుగానికి నాలిక?"**

ఇక్కడ "జెండా" స్వేచ్ఛకు, ఆత్మగౌరవానికి, పోరాటస్ఫూర్తికి ప్రతీక. గాలిలో ఎగిరే "రంగుల పేలిక" కవి హృదయంలోని అనేక భావోద్వేగాలకు, ఆశయాలకు, అనుభవాలకు దృశ్యరూపం.

**"అది ఈ యుగానికి నాలిక"** అనడం ద్వారా శేషేంద్ర కవి పాత్రను స్పష్టీకరిస్తాడు. కవి తన వ్యక్తిగత అనుభూతులకే పరిమితుడు కాదు; తన కాలపు చైతన్యానికి స్వరం. తన కాలపు బాధ, ఆకాంక్ష, ఆవేదన, స్వప్నం, తిరుగుబాటు తన కంఠం ద్వారా పలకాలని కోరుకునే వాడే యుగకవి.

కవిత్వం ఆలోచనకు, జీవన జాగృతికి సాధనం

శేషేంద్ర తన కవిత్వాన్ని కేవలం ఆస్వాదించమని కాదు, ఆలోచించమని కోరుతాడు:

**"వినండి నా మాటలు-విని విని**
**ఆలోచనా దంతాలతో నమిలి నమిలి**
**నా మాటల లోతులో మునిగిపోండి!**
**ఎవడు చచ్చి మన జీవితాల్లో పూలు పూయిస్తాడో**
**వాడి భాష చిరంజీవి...."**

"ఆలోచనా దంతాలతో నమిలి" అనే రూపకం శేషేంద్ర కవిత్వ స్వభావాన్ని తెలియజేస్తుంది. ఆయన కవిత్వం పైపైన చదివి వదిలేయ దగినది కాదు; దాని అంతరార్థంలోకి ప్రవేశించాలి. కవిత్వం పాఠకుడిని ఆలోచింపజేయాలి, అంతరంగాన్ని కదిలించాలి.

**"ఎవడు చచ్చి మన జీవితాల్లో పూలు పూయిస్తాడో వాడి భాష చిరంజీవి"** అనే భావంలో కవి త్యాగం, ప్రజాహితం, కవిత్వం కాలాతీతంగా నిలిచే గుణం ఒకటవుతాయి. కవి శరీరం నశించినా, ప్రజల జీవితాల్లో పూలు పూయించే అతని భాష తరతరాల హృదయాల్లో జీవిస్తూ ఉంటుంది.





తన కవిత్వ స్వరూపాన్ని తానే నిర్వచించుకుంటూ శేషేంద్ర ఇలా అంటాడు:

**"శేషేన్ నీ పాటకు రోజా ఒక పునర్జన్మ**
**నీ పాటకు ఈ జగవే ఒక రూపాంతర చేతన**
**ఈ దేశాలీ ఖండాలొకే భూమి కుటుంబం**
**అనుకునేదెప్పుడనే నీ స్వాప్నిక యాతన?**
**ప్రేమే నీ మంత్రం హృదయం నీ పీఠం**
**ఓ శేషేన్ నీవే ఒక ప్రేమ లోక దేవతవు**
**నీ కోసం ఒక కోవెల నిర్మించాలనుకుంటే**
**చెట్టునాటి కొమ్మమీద కోకిల పెడితే చాలు!"**

ఈ పంక్తుల్లో శేషేంద్ర కవిత్వానికి కేంద్రబిందువుగా ప్రేమను ప్రతిష్ఠించాడు. ఆ ప్రేమ వ్యక్తిగత ప్రేమను దాటి విశ్వమానవ ప్రేమగా పరిణమిస్తుంది. దేశాలు, ఖండాలు దాటి "భూమి కుటుంబం" అనే భావన వైపు కవి ప్రయాణిస్తాడు.

"హృదయం నీ పీఠం" అనే వాక్యం కవి కవిత్వానికి అంతరంగమే ఆలయం అని సూచిస్తుంది. "చెట్టునాటి కొమ్మమీద కోకిల పెడితే చాలు" అనే ప్రతీకలో ప్రకృతి, సంగీతం, కవిత్వం ఒకటవుతాయి. కవికి రాతి గుడి అవసరం లేదు; ప్రకృతిలో స్వేచ్ఛగా పలికే కోకిల గానం చాలు అదే అతని కవితా మందిరం.

శేషేంద్ర ప్రకృతి దృష్టిలో వసంతం కేవలం ఋతువు కాదు; అది సృజనాత్మక పునర్జన్మ:

**"వసంతం అంటే కోకిలల పాఠశాల**
**పక్షుల సంగీత అకాడమీ**
**ఒక్కో పక్షి వెయ్యేసి పాటలుగా**
**రూపాంతరాలు పొందే ఋతువు**
**అందుకనే లోకం ఎప్పుడూ**
**ఒక కొత్త వసంతం కోసమే నిరీక్షిస్తూ ఉంటుంది."**

**"కోకిలల పాఠశాల", "పక్షుల సంగీత అకాడమీ"** అనే రూపకాలు శేషేంద్ర ఊహాశక్తికి నిదర్శనం. వసంతం ఇక్కడ ప్రకృతిలోని పునరుజ్జీవనానికి మాత్రమే కాదు, కళలోని సృజనాత్మక పునరుజ్జీవనానికి కూడా ప్రతీక.

**"ఒక్కో పక్షి వెయ్యేసి పాటలుగా రూపాంతరం పొందే ఋతువు"** అనడం ద్వారా వసంతాన్ని సృజనకు, నూతనత్వానికి, జీవచైతన్యానికి ప్రతీకగా నిలిపాడు. **"లోకం ఎప్పుడూ ఒక కొత్త వసంతం కోసమే నిరీక్షిస్తూ ఉంటుంది"** అనే ముగింపు ప్రతి యుగం కొత్త ఆశను, కొత్త చైతన్యాన్ని, కొత్త సృష్టిని కోరుకుంటుందనే తాత్త్విక భావనను అందిస్తుంది.

ప్రకృతి సౌందర్యం నుంచి సామాజిక ధర్మాగ్రహం వరకు శేషేంద్ర కవిత్వాన్ని కేవలం సౌందర్యకవిత్వంగా చూడటం మాత్రమే కాదు, ఆయన కవిత్వంలో ప్రకృతి సౌందర్యం ఎంత బలంగా ఉందో, సామాజిక స్పృహ కూడా అంతే బలంగా ఉంది.

మయూరం అంటే నెమలి. భారతీయ సాహిత్య, సాంస్కృతిక సంప్రదాయాల్లో నెమలి కేవలం ఒక పక్షి కాదు. అది సౌందర్యానికి, వర్షఋతువు పరవశానికి, నూతన చైతన్యానికి, శృంగార భావనకు, ఉల్లాసానికి ప్రతీక. నెమలి పురివిప్పినప్పుడు ప్రకృతి తన సౌందర్యాన్ని తానే ఆవిష్కరించుకున్నట్లుంటుంది. అయితే మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ కవిత్వంలో మయూరం ఈ సహజ సౌందర్య పరిమితిని దాటి, కవి అంత రంగానికి, స్వేచ్ఛాకాంక్షకు, సృజనా త్మక చైతన్యానికి, సౌందర్య స్పృహకు, సామాజిక ధర్మాగ్రహానికి ప్రతీకగా నిలుస్తుంది.

పేదరికం, ఆకలి, దోపిడీ, అసమానత, అధికార దుర్వినియోగం, శ్రమజీవుల జీవితం వంటి సామాజిక వాస్తవాలు ఆయన కవిత్వం లో ప్రతిధ్వనిస్తాయి.

'గొరిల్లా' కావ్య వస్తువుకు ప్రేరణ ఏమిటని నేను శేషేంద్రను ప్రశ్నించినప్పుడు, దేశంలో ఉన్న దారిద్ర్యం, అసహాయులుగా ఆకలితో చచ్చిపోయే అసంఖ్యాక జనం అని ఆయన సమాధానమిచ్చారు. ఈ సమాధానం ఆయన కవిత్వంలోని సామాజిక బాధ్యతను స్పష్టంగా తెలియజేస్తుంది.

అందువల్ల శేషేంద్రకు కవి అంటే కేవలం సౌందర్యాన్ని ఆస్వాదించే వ్యక్తి కాదు; సమాజపు బాధను చూసి స్పందించే చైతన్యశీలి.

ఐదవ సర్గలో శేషేంద్ర కవి స్వరాన్ని గర్జనగా ప్రతిష్ఠిస్తాడు:

**"గర్జించు ఓ శేషన్! నిర్భయంగా గర్జించు**
**దిశలు బ్రద్దలయ్యేలా గర్జించు?**
**ఓ శేషన్ ఓ శేషన్**
**దేశకాల బంధాలను ధిక్కరించి తెంచుకో**
**మానవ దేహాలయ దేవత**
**మనిషిని దర్శించుకో**
**నీ రగిలే గుండెలతో నీరాజన మిచ్చుకో"**

**"గర్జించు"** అనే పదం ఇక్కడ కేవలం శబ్దం కాదు; అన్యాయం, అసత్యం, దోపిడీ, మానవ అవమానంపై కవి పలికే నిర్భయ స్వరం.

**"మానవ దేహాలయ దేవత / మనిషిని దర్శించుకో"** అనే భావం శేషేంద్ర మానవతా తత్త్వానికి కేంద్రబిందువు. మనిషిలోనే దైవత్వాన్ని దర్శించే దృష్టి ఇది. కాబట్టి కవిత్వం మానవుడి గౌరవాన్ని కాపాడే ధర్మస్వరంగా ఉండాలి.

అదే ధర్మాగ్రహం మరింత స్పష్టంగా ఇలా వ్యక్తమవుతుంది:

**"బాధితుల క్యూలో నిల్చుని దర్శించు జీవితాన్ని**
**సిగ్గువిడిచి దేవుడికైనా మ్రొక్కు**
**మ్రొక్కిన చేతిని కూడా మ్రింగే**
**మనిషికి మాత్రం మ్రొక్కబోకు"**

బాధితుల మధ్య నిలబడటం ద్వారా జీవిత వాస్తవాన్ని తెలుసుకోవాలని కవి చెబుతున్నాడు. దేవుడి ముందు వినయంగా తలవంచినా, మనిషిని దోపిడీ చేసే శక్తి ముందు మాత్రం తలవంచకూడదనే ఆత్మగౌరవ సందేశం ఇందులో ఉంది.

ఆరవ సర్గలో నెమలి కేవలం కవితా ప్రతీకగా కాక, కవి జీవితంలో భాగస్వామిగా ప్రత్యక్షమవుతుంది.

**"ఆ యింట్లో**
**ఒక తోట-ఆ తోటలో ఒక నెమలి?...**
**నేనెక్కడుంటే అక్కడికి వస్తుంది...**
**నేను వ్రాసుకుంటూనో, చదువుకుంటూనో దాన్ని గుర్తించకపోతే**
**నా పైజామా తన ముక్కుతో లాగుతుంది..."**

ఇక్కడ నెమలి కవి జీవితానికి వెలుపల ఉన్న ప్రకృతి వస్తువు కాదు. అది కవి అంతరంగంతో అనుబంధం పెంచుకున్న ఆత్మీయ జీవి. కవి రాస్తున్నప్పుడు, చదువుతున్నప్పుడు తన ఉనికిని గుర్తు చేస్తూ, అతని సృజనాత్మక జీవితంలో భాగమవుతుంది. ఇక్కడి నుంచే శేషేంద్ర జీవితం-మరణం, వాస్తవం-స్వప్నం మధ్య ఒక విచిత్రమైన కవితా ప్రయాణాన్ని ప్రారంభిస్తాడు.

''ఒకరోజు నేను చచ్చిపోయాను'' అని చెబుతూ, తన గదిలో తన శరీరం చుట్టూ ఏడుస్తున్న మనుషులను, మెల్లగా వస్తున్న నెమలిని తాను చూస్తున్నట్లుగా వర్ణిస్తాడు. ఈ దృశ్యం మరణాన్ని ఒక అంతిమ విరామంగా కాక, ఆత్మపరిశీలనకు ఒక కవితా ద్వారంగా మార్చుతుంది.

జీవితం ఒక కలా? కలే ఒక జీవితమా? అనే ప్రశ్నల మధ్య కవి తన జీవితాన్ని, తన సాహిత్యాన్ని, తనకు ప్రీతిపాత్రమైన రచయితలను, తన సృజనాత్మక ప్రయాణాన్ని తిరిగి దర్శించుకుంటాడు.

### విశ్వసాహిత్యంతో శేషేంద్ర సంభాషణ

ఈ ఆత్మపరిశీలన క్రమంలో మోపాసా, వాల్మీకి, కామూ, కాఫ్కా, భవభూతి, ప్లేటో, ఇలియట్, పాబ్లో నెరూడా వంటి అనేక మంది రచయితలు, మేధావులు కవి జ్ఞాపకంలో ప్రత్యక్షమవుతారు.

ఏడో, ఎనిమిదో సర్గల్లో శ్రీశ్రీ, రింబో తదితరులతో కవి ఊహాత్మక సంభాషణ సాగిస్తాడు. ముఖ్యంగా రింబోతో కలిసి నడుస్తున్న దృశ్యంలో ప్రపంచ సాహిత్యంలోని అనేక మహామేధావులు ఒక మహా కవితా ఊరేగింపులా కనిపిస్తారు:

భవభూతి, కోకో, లియోనార్డో, నెరూడా, మెకలెంజేలో, బోదిలైర్, మల్లార్మే, కాళిదాసు, ఇలియట్, పౌండ్, జార్జ్ శాంటాయనా, గాలిబ్, కృష్ణరాయలు, సౌదా, మీర్, ఎర్రన, శ్రీనాథుడు, లోర్కా, ఇక్బాల్, రోడే, రిల్కే, విర్జిల్, పికాసో, సోక్రటీస్, జీసస్, కవబాటా, కవఫీ, సెఫెరిస్... ఇలా అనేక మంది సాహిత్య, కళా, తాత్త్విక మహనీయులు శేషేంద్ర కవితా ప్రపంచంలో ప్రవేశిస్తారు.

ఈ విస్తృతమైన పేర్ల పరంపర కేవలం పాండిత్య ప్రదర్శన కాదు. శేషేంద్ర తనను తెలుగు సాహిత్య పరిమితుల్లో మాత్రమే కాక, విశ్వ సాహిత్య పరంపరలో ఒక కవిగా చూసుకున్నాడనే విషయాన్ని ఇది సూచిస్తుంది. భారతీయ సాహిత్య సంప్రదాయాన్ని, పాశ్చాత్య సాహిత్యాన్ని, ప్రపంచ కవిత్వాన్ని తన కవితా చైతన్యంలో కలిపే విశాల దృష్టి ఇందులో కనిపిస్తుంది.

కవి మరణిస్తాడు - కవిత్వం నిలుస్తుంది

తన కవిత్వం గురించి శేషేంద్ర అత్యంత విశ్వాసంతో ఇలా అంటాడు:

**"ఓ శేషేన్ వేణువు ధరించి వచ్చావు మాతృగర్భం నుంచి ఈ లోకంలోకి**
**పాడుతున్నావు నీ స్వరమంతా పూరించి వేణువులోకి...**
**నీ స్వప్నాలు ఫలిస్తాయి**
**నీ పాట బజారుల్లో పడవరేవుల్లో పొలాల్లో సహజ బీజాలు చల్లుతుంది**
**నీ పాటలు కార్మికులు కర్షకులు సైనికులు నావికులు పాడుతారు**
**చెట్లు పూచేలా పాడుతారు**
**...**
**నీ స్వరాలు ఫలిస్తాయి**
**నీ పాటలు నిలుస్తాయి"**

ఇక్కడ **"పాట"**కు **"బీజం"** అనే రూపకం అత్యంత అర్థవంతమైనది. బీజం నేలలో పడితే మొలకెత్తి చెట్టవుతుంది. అలాగే కవిత ప్రజల హృదయంలో పడితే ఆలోచనగా, చైతన్యంగా, గానంగా, జీవన విలువగా మొలకెత్తుతుంది.

కవి శరీరం మరణించవచ్చు; కానీ అతని కవిత ప్రజల నోట పాటగా మారితే అతని సృజనాత్మక జీవితం కొనసాగుతూనే ఉంటుంది. కవి లేకపోయినా అతని కవిత్వం ప్రజల హృదయాల్లో జీవిస్తూనే ఉంటుందనే భావనను మయూర పర్వం బలంగా వ్యక్తం చేస్తుంది.

వనజ్వాలలో లీనమయ్యే కవి-కవి.-ప్రకృతి ఏకత్వం

మయూర పర్వపు చివరి దృశ్యం అత్యంత ప్రతీకాత్మకమైనది. రింబోతో పాటు ముందుకు సాగుతున్న శేషేంద్ర ఒక వనజ్వాల వైపు వెళ్తాడు:

**"నేను ముందున్న వనజ్వాల వైపు వెళ్ళుతున్నాను,**
**వెళ్ళుతున్నాను,**
**వనజ్వాల నన్ను అడ్డగించలేదు;**
**అందులోకే వెళ్ళిపోయాను.**
**నన్ను తనలోకి తీసుకుంది.**
**నేను లేదు.**
**వనజ్వాల ఉంది."**

ఇది కేవలం మరణ దృశ్యం కాదు. వ్యక్తి నుంచి విశ్వంలోకి, కవి నుంచి ప్రకృతిలోకి, 'నేను' నుంచి 'సమస్తం'లోకి కలిసిపోయే ఐక్యభావానికి ప్రతీక.

ప్రకృతిని జీవితాంతం ప్రేమించిన కవి చివరికి ప్రకృతిలోనే లీనమవుతాడు. కవి తన వ్యక్తిత్వాన్ని కోల్పోవడం ద్వారా ప్రకృతిలో నశించడు; ప్రకృతిలో భాగమై మరింత విశాలమైన ఉనికిని పొందుతాడు.

అతని వెనుక వచ్చిన మహాకవులు కూడా పువ్వు పువ్వులో లీనమవుతారు. ప్రతి ఏప్రిల్‌లో వనజ్వాల ఎర్రగా విరబూస్తుంది. లక్షల పూలు గొంతులు విప్పి పాడుతున్నట్లుగా కవి ఊహిస్తాడు. ఇక్కడ కవి మరణం ప్రకృతి పునరుజ్జీవనంగా మారుతుంది.

అందుకే చివరికి వచ్చే ,

**"రండి మా గుమ్మానికి తోరణాలుకండి**
**మానవ జీవితాన్నొక మహోత్సవం చేయండి"**

అనే ఈ పిలుపు మయూర పర్వపు తాత్త్విక ప్రయాణానికి సార్థక ముగింపు. మరణాన్ని చూసిన కవి జీవితాన్నే ఉత్సవంగా చూడమంటాడు. సమాజంలోని అన్యాయాన్ని ప్రశ్నించిన కవి బాధల మధ్య కూడా సౌందర్యాన్వేషణను కొనసాగిస్తాడు. ప్రేమను తన మంత్రంగా ప్రకటిస్తాడు. ప్రకృతిలో లీనమయ్యే కవి మానవ జీవితాన్ని మహోత్సవంగా మార్చాలని పిలుపునిస్తాడు.

'మయూర పర్వము' శేషేంద్ర కవిత్వానికి ఒక ప్రతీకాత్మక దర్పణం. ఇందులోని మయూరం కేవలం ప్రకృతి సౌందర్యానికి ప్రతీక కాదు; అది కవి అంతరంగానికి, స్వేచ్ఛాకాంక్షకు, సృజనాత్మక చైతన్యానికి, సౌందర్యస్పృహకు ప్రతీక.

తొలి సర్గలో జీవితం-స్వప్నం-సుఖం-లోకం గురించి తాత్త్వికంగా ఆలోచించిన కవి, ప్రకృతి సౌందర్యంలో తన కవిత్వానికి ప్రేరణను పొందుతాడు. రెండో సర్గలో తన హృదయాన్నే యుగానికి జెండాగా ఎగురవేస్తాడు. కవిత్వాన్ని ఆలోచనకు, జీవన జాగృతికి సాధనంగా భావిస్తాడు. ప్రేమను తన మంత్రంగా, హృదయాన్ని తన పీఠంగా ప్రకటిస్తాడు. వసంతాన్ని సృజనాత్మక పునర్జన్మకు ప్రతీకగా నిలుపుతాడు.

సామాజిక వాస్తవాలను దర్శించినప్పుడు అదే కవి ధర్మాగ్రహంతో గర్జిస్తాడు. బాధితుల పక్షాన నిలబడమని, దోపిడీ ముందు తలవంచవద్దని చెబుతాడు. నెమలితో తన అనుబంధం ద్వారా ప్రకృతిని తన అంతరంగ సహచరిగా చేసుకుంటాడు. మరణాన్ని ఎదుర్కొంటూ తన సాహిత్య ప్రయాణాన్ని, తనకు పూర్వం వచ్చిన ప్రపంచ మహాకవులను స్మరించుకుంటాడు. విశ్వసాహిత్యంతో తన కవిత్వానికి ఉన్న సంబంధాన్ని ఆవిష్కరిస్తాడు.

చివరికి వనజ్వాలలో లీనమవుతూ "నేను లేదు - వనజ్వాల ఉంది" అనే స్థితికి చేరుకుంటాడు. వ్యక్తి లయ మాత్రమే కాదు; కవి విశ్వంలోకి, ప్రకృతిలోకి, తన కవిత్వం ద్వారా కాలాతీతమైన కీర్తిలోకి ప్రవేశించే ప్రతీకాత్మక పరిణామం. కవి శరీరం అంతరించవచ్చు; కానీ అతని పాట ప్రజల జీవితాల్లో బీజాలుగా మొలకెత్తి, తరతరాల గొంతుల్లో గానమై నిలుస్తుంది.

అందువల్ల 'మయూర పర్వము' కేవలం శేషేంద్ర ఆత్మకథాత్మక కవిత్వం కాదు; ప్రకృతి, సౌందర్యం, ప్రేమ, మానవత, స్వేచ్ఛ, సామాజిక చైతన్యం, ధర్మాగ్రహం, విశ్వసాహిత్య దృష్టి, కవికి ప్రకృతితో ఉన్న అంతరంగ అనుబంధం, తరతరాలకూ స్ఫూర్తినిచ్చే కవిత్వ ప్రభావం వంటి అనేక అంశాలను సమన్వయిస్తూ, కవి జీవితం, కవిత్వం, విశ్వంతో అతని అనుబంధాన్ని ఆవిష్కరించే సమగ్ర తాత్త్విక కవితా ప్రస్థానంగా నిలుస్తుంది.

మయూరం పురివిప్పినప్పుడు దాని రెక్కల్లో అనేక రంగులు కనిపించినట్లే, శేషేంద్ర 'మయూర పర్వము'లో కవిత్వానికి అనేక పార్శ్వాలు దర్శనమిస్తాయి. ఆ రెక్కల ప్రతి రంగు ఒక భావం; ప్రతి భావం ఒక జీవన సత్యం; ప్రతి జీవన సత్యం ఒక కవితా తత్త్వం. అందుకే 'మయూర పర్వము' శేషేంద్ర కవిత్వపు పురివిప్పిన నెమలి మాత్రమే కాదు ఆయన సమగ్ర కవితా తాత్త్వికతకు ఒక సజీవ ప్రతిరూపం.

*(మహా కవి గుంటూరు శేషేంద్రశర్మ శత జయంతి ప్రారంభ సంవత్సరం 20-10 -2026 నుండి 20-10-2027 సందర్భంగా).*

## నీతిని బోధించే కథలు 'మనుష్యులూ మనస్తత్వాలు'




పుస్తకావిష్కరణలో పెద్దూరి వెంకటదాసు, పొత్తూరి జయలక్ష్మి, పొత్తూరి సుబ్బారావు, డా॥ కె.వి.రమణాచారి, పులివర్తి కృష్ణమూర్తి, వై.రామకృష్ణరావు, వంశీ రామరాజు, మార్ని జానకిరామ చౌదరి తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 21:(నేటినిజం ప్రతినిధి): సమాజంలోని విభిన్న మనుషుల స్వభావాలకు అద్దం పడుతూ, నీతిని బోధించే కథలు 'మనుష్యులూ మనస్తత్వాలు' సంపుటిలో ఉన్నాయని ప్రభుత్వ పూర్వ సలహాదారు డా॥కె.వి.రమణ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో, త్యాగరాయ గానసభ సౌజన్యంతో సాహితీకిరణం పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు రచించిన ఈ కథాసంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించారు. డా॥కె.వి.రమణ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ సమాచార శాఖలో అధికారిగా పనిచేసిన సమయంలో పరిచయమైన పలువురి స్వభావాలను నిశితంగా పరిశీలించి సుబ్బారావు ఈ కథలు రాశారని, నేటితరం వీటిని చదవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పులివర్తి కృష్ణమూర్తి మాట్లాడుతూ... పొత్తూరి సుబ్బారావు సాహితీ పత్రికను నిర్వహిస్తూ ఎంతోమంది రచయితలను ప్రోత్సహించడంతో పాటు తన సాహితీవ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారని అభినందించారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, ప్రముఖ కథారచయిత డా॥వై.రామకృష్ణారావు మాట్లాడుతూ... మనుషులు వ్యక్తిత్వాలను ఆసక్తికరంగా తెలుసుకునేందుకు ఈ కథలు ఉపయోగపడతాయని అన్నారు. ప్రచురకర్త జ్యోతి సాహితీ స్రవంతి (కాకినాడ) అధ్యక్షుడు మార్ని జానకిరామ చౌదరి తదితరులు రచయితను అభినందించారు. పెద్దూరి వెంకటదాసు సభను నిర్వహించారు. తొలుత లలితావాణి నిర్వహణలో 'విజయ సాధన' అనే అంశంపై కవిసమ్మేళనం జరిగింది. పొత్తూరి అనుద్యుతి ప్రార్థనాగీతం పలువురిని ఆకట్టుకుంది.




తెలుగు సాహితీ సాంస్కృతిక రంగాలలో 'జయంతి పబ్లికేషన్స్' గత కొన్ని దశాబ్దాలుగా 'పుస్తక ప్రచురణ-సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ'లో విశేషమైన సేవలు అందిస్తూ... కొనసాగుతున్నది. తెలుగులోని లబ్ధప్రతిష్ఠులైన సాహితీవేత్తలు మొదలుకొని వర్ధమాన రచయితల రచనలు 500 లకి పైగా ప్రచురించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కవులు, రచయితలు, కళాకారులను ఒకే వేదిక పైకి తెచ్చి, తెలుగుభాష వికాసానికి అనేక నూతన, రికార్డు స్థాయి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ఘనచరిత్ర కలిగిన సంస్థ... 'జయంతి పబ్లికేషన్స్'

# పూద్చుకోలేని తప్పు

(కథానిక)

సత్యం సార్థక నామ ధేయుడు.

మనసులో ఒకటి పైన ఒకటి ఉండదు. తెల్లకాగితం లాంటి మనసు.

చిన్నప్పుడు పది మందిలో ఒకడు కాబట్టి తండ్రి ఒక్కడే సంపాదన. పిల్లలందరిని ఉన్నంతలో చదివించి ఉన్నతంగా పెంచారు. చిన్నప్పటి విషయాలు ఎలా వున్నాం, ఎట్లా బ్రతికాం, కన్నవారు ఇంత కష్ట పెట్టకుండా ఎంత బాగా కాపాడి పోషించారు. ఇప్పుడు ఒక్కరిద్దరికే ఆపసోపాలు పడుతున్నారు. అప్పటి దినాలే మంచివి. కలిసిమెలిసి ఉండేవాళ్ళు . తృప్తిగా జీవించారు. ఇప్పుడు పిల్లలు కూడా వద్దనుకునే దౌర్భాగ్యులు వున్నారు అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

పిల్లలిద్దరూ అమ్మాయిలను బాగా చదివించారు. బి.టెక్ వరకు ఇండియాలోనే వున్నారు. బాగా జాగ్రత్తలు తీసుకున్నారు. అన్ని వసతులు సమకూర్చారు.వారు అడిగిన పుస్తకాలు కొనిచ్చారు. పిల్లలను ఎంతో గారబంగా పెంచారు తల్లిదండ్రులు. ఉన్నత చదువులు చదివి అమెరికాలో స్థిరపడ్డారు.

పెద్దమ్మాయికి తాను కోరుకున్నవాడితో పెళ్లిచేశారు. సంసారం బాగానే సాగుతుంది. వాళ్ళకి ఒక అమ్మాయి పుట్టింది. చాలా తెలివిగలది, అందమైనది. తనొక్కతే ఏదీ ఉంటే దానితో ఆడుకుంటుంది.

అంతా బాగానే వుంది కానీ వాళ్ళు చెప్పినట్టే వినాలి. ఇప్పుడు వాళ్ళు పెద్దవాళ్ళయ్యారు. మీకేమి తెలియదు. అంటారు.కష్టపడ్డ జీవితాలు కాబట్టి డబ్బును నీటిప్రాయంగా వృధాగా ఖర్చు పెట్టడం ఇష్టం ఉండదు. అట్లాని పిసినాసి కాదు. అవసరమొస్తే ఎంతైనా ఖర్చు పెడతాడు. పైసా పైసా కూడబెట్టి ఓ ఇల్లు కట్టుకున్నాడు. లేని వాళ్లకు, మంచిగా చదివే అమ్మాయిలకు సహాయం చేసే గుణం కూడా ఉంది.

ప్రభుత్వఉద్యోగం చేసి విశ్రాంతి తీసుకోకుండా ఏవో రచనలు చేస్తుంటాడు. ఎప్పుడు చురుకుగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం అనే మనస్తత్వం.

అక్క చెల్లెల్లు తమ్ముళ్లు అంటే ప్రేమ ఎక్కువే. కవిమిత్రులను కూడగట్టుకుని అందరితో కలుపుగోలుగా ఉంటాడు.

చిన్న అమ్మాయి పెళ్లి కూడా తెలిసిన అబ్బాయితో చేశారు. కూతురు అల్లుడు బాగానే వుంటున్నారు. అత్తమామలు మంచివాళ్ళు పెద్దమ్మాయి అత్తగారు వాళు ళ్ళ కూడా చాలా మంచోళ్ళు.అందరూ ఒకే ఇంటివాళ్ళ లాగా ప్రేమగా కలిసి వుంటారు.

అన్నీ బాగానే ఉన్నాయి. అందరూ బాగానే వున్నారు. పిల్లలు అమెరికాలో ఆనందంగా వున్నారు. కానీ మనసుకు ఒక వెలితి.

పెద్దమ్మాయి కనీసం ఒక్కదాన్నన్న కనింది.ఇదేమో ఇలా అని మనసులో వేదన. ఎవరితో చెప్పుకోలేము. మీరేం హాయిగా ఉన్నారని అంటారు.కానీ పరిస్థితి ఇది. చిన్నమ్మాయి మాత్రం నాకు పిల్లలు వద్దు నేను కనను అంటుంది.ఎందుకో తెలీదు.

పిల్లలు పుడితేనే మంచిది. తరువాతి తరం కావాలి. నీ అక్కకు పిల్లలున్నా నీ పిల్లలు వేరు కదా. ఎవరి కడుపుతీపి వారిది. వేరే వారి పిల్లల మీద నీకు ఎందుకు చనువు ఉంటుంది. కాకిపిల్ల కాకికి ముద్దు.

వయసులో ఉన్నప్పుడే కనాలి. వయసు దాటితే పిల్లలు పుట్టడం కష్టం. ఇంట్లో పిల్లలు తిరుగుతుంటే ఎంత ఆనందం. ఎంత తృప్తి.మన పిల్లలు మనకు ఉండాలి. అని వాళ్ళ అమ్మ చెపుతుంది.

"వద్దమ్మ మళ్ళీ ఇంకోసారి పిల్లల గురించి మాట్లాడితే నేను నీతో మాట్లాడను" అని అమెరికా నుండి చేసే వాట్సాప్ కాల్ కట్ చేస్తుంది

పిల్లలు వినరు చెపితే అర్థం కాదు. దాటిన వయసు తిరిగిరాదు. మేము ఎంత కాలం ఉంటాం. ఎప్పుడో ఒకప్పుడు పోయేవాళ్లమే కదా.పోనీ వేరే పిల్లలను తెచ్చి పెంచాలంటే ఎవరి గండమో ఎవరి పిండమో.

వయసు ఉంది కనే సత్తావుంది. మన కడుపు పంట మనకు.ఆ ప్రేమే వేరు.అని తలపోస్తూ నిజంగా పిల్లలు కనకుంటే ఎంత సంపాదించినా దండగే. ఎంత ఆస్తి వున్నా దండగే.

వయసు అంతా అయిపోయాక పిల్లలు కావాలంటే వస్తారా? ఏ వయసులో ఏది చేయాలో అది చేస్తే అందం . బాగా చదువుకున్నామని అనుకుంటారు, మాకే తెలివుండని అనుకుంటారు కానీ వీళ్లంతా మూర్ఖులు ఎవరుండరు. చదివేస్తే ఉన్నమతి పోయిందన్నట్టు. అసలు ఏమి తెలియని వారు, చదువు లేనివారే నయం. పిల్లల్ని కని ఆనందంగా సంసారం చేసుకుంటారు. వీళ్ళదంతా అతి తెలివి.అన్ని తెలుసనుకొని మొండిగా ప్రవర్తిస్తారు.అని మదన పడుతుంది తల్లి.

ఎంతైనా కన్నతల్లి కదా. కాస్త బాధ ఉంటుంది కానీ ఏమీ చెప్పలేక పోతుంది మూర్ఖపు బిడ్డకు.

వయసంతా అయిపోయాక అప్పుడు కావాలంటే పిల్లలు పుట్టుకొస్తారా. మాకు తెలిసిన అమ్మాయికి అంతే. వయసులో వున్నప్పుడు ఎంజాయ్ అంటూ పిల్లలను కనలేదు. కావాలన్నప్పుడు కలగలేదు. తిరగని గుడి లేదు. మొక్కని దేవుడు లేడు.తొక్కని డాక్టరు గడప లేదు.ఇప్పుడు వయసయిపోయింది. తెగ బాధ పడతారు. ఏదేమైనా తే వయసులో ఏది చేస్తే ముద్దో అదే చేయాలి. అప్పుడే జీవితానికి సార్థకం, బ్రతుకుకు అర్థం.

తర్వాత పూడ్చుకోలేము. వెనక్కి తీసుకోలేము. చదువులెక్కువయ్యి వేషధారణలో ఆలోచనలో మార్పులు చూస్తున్నాం. మారుతున్న సమాజం మారుతున్న ఆలోచనా వైఖరి. ఎంతవరకు. ఎటు పోతుంది సమాజం. అభివృద్ధి పథం వైపా, అధః పాతాళానికా.

చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదు.పెద్ద వాళ్ల మాట చద్ది మూట అనే విషయం మరచి చాదస్తం అనుకుంటారు.

తర్వాత బాధ పడ్డా ప్రయోజనం శూన్యం. సమాజం మనం ఏంటి పరిస్థితి ఆలోచించి ముందడుగు వేయాలి.ఆలోచనలకు పదును పెట్టాలి. పెద్దలు చెపితే వినాలి. పెద్దలు ఏది చెప్పినా మీ మంచికే కానీ వారికొచ్చే ప్రయోజనం అణువంతైనా ఉండదు. ఎక్కడ ఉన్నా సుఖం కోరుకునే వాళ్ళు. కన్నవారు స్వార్థపరులు కాదు. పిల్లల కొరకే వారి బ్రతుకు పూడ్చుకోలేని తప్పు చేస్తున్నావ్ దిద్దుకోలేని తప్పు చేస్తున్నావ్. తర్వాత ఎన్ని అనుకున్నా ఎవరూ రారు. ఏమి చేయరు. ఏదో చేస్తా రని ఆశ పడడం కూడా తప్పే. మన తెలివిని మనను మనవే నమ్ముకోవాలి అనుకుంది ఆ తల్లి..

ఆలోచించండి. చించండి కళ్ళు తెరవండి. భగవంతుడు అన్నీ ఇచ్చాక ఆరోగ్యం ఐశ్వర్యం ఆనందం పిల్లల్ని కనే సత్తా. ఇవన్నీ అందరికీ ఉండవు. పిల్లల కొరకు లేనివాళ్ళు పిల్లలు పుట్టాలని ఎన్నో పాట్లు గుడి గోపురాలు తిరగడం,డాక్టర్ల చుట్టూ తిరగడం ఎంతో మంది ఉన్నారు. మనలో అన్ని వసతులు ఉన్నపుడు గొడ్రాలుగా మిగిలిపోవడం సబబేనా. వయసుడుగినాక కావాలని బాధ పడ్డా ప్రయోజనం శూన్యం. ఎవ్వరు ఏమి చేయలేరు. చేతులు కాలాకఆకులు పట్టుకున్నట్టే. అందుకే దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. మనం ఇంకో తరానికి పునాది అవాలి. సంసారం దినదిన ప్రవర్ధమానం కావాలి. నీకు పుట్టేవాళ్లే గొప్పోళ్ళు, మహనీయులు కావచ్చు. ఏ పుట్టలో ఏ పాముందో, ఎవరితో ఏమి జరుగునో, దేశానికి ఒక గొప్ప వాళ్ళను ఇచ్చిన వాళ్ళను అవుతాము. అప్పుడు వాళ్ళ అమ్మానాన్న పిల్లలు వద్దు అనుకుంటే.. అబ్దుల్ కలాం, గాంధీజీ, ఇందిరాగాంధీ, సుబ్బలక్ష్మి, పి.వి.సింధు ఆఖరికీ మార్క్స్ కూడా పదిమంది పిల్లల్ని కన్నాడు చాలా కష్టాల్లో ఉండి కూడా. ఆటగాళ్లు, గాయకులు, నృత్యకారులు, రచయితలు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు ఇలా ఎంత మంది ఎన్నెన్ని రంగాల్లో రాణించారో చూస్తున్నాము. కనే అవకాశం వున్నప్పుడు వదులుకోవద్దు. అవకాశాలు వెదికి రావు. మనమే అవకాశాలను వెదుక్కోవాలి. మనం ఎవరికోసం తాపత్రయ పదక్కరలేదు. మన చేతిలో పని చాతనయిన పని మనం చేయొచ్చు. పెద్ద వాళ్ళు చాదస్తులు అనుకోకుండా వారి అనుభవాన్ని గమనించాలి . తెలుసుకోవాలి. మాకే అంతా తెలుసు వాళ్ళు పెద్దవాళ్ళు,ముసలోళ్ళకు ఏమి తెలుసు అనడం అజ్ఞానం.వాళ్లకు ఏమి తెలియకనే సంసారం కొనసాగించారా? పిల్లల్ని గొప్పవాళ్లను చేశారా? వున్నా లేకున్నా తమ పిల్లలంటే వాళ్లకు ప్రేమ. తాము కడుపు మాడ్చుకుని కూడా పిల్లలకు పెట్టి తింటారు. అప్పులు చేసైనా చదివిస్తారు పెళ్లిళ్లు చేసి.పెద్దవాళ్ళను చేస్తారు.ఇంకా సరిపోదని మనుమడు,మనుమరాళ్లు కావాలని వాళ్ళ పిల్లలకు కూడా సేవ చేస్తారు.ఇదంతా ప్రేమతోనే సుమా. ఇద్దరైనా ఉంటే ముద్దు.ఒకరికొకరు తోడుగా వుంటారు. మన ముద్ర ఉండాలి మనం పొయ్యాక కూడా. మన సిగ్నేచర్ అంటే తరువాతి తరం పిల్లలే. పశుపక్ష్యాదులు కూడా వయసొచ్చాక సుఖాన్ని అనుభవిస్తాయి. శిశిర ఋతువులో ఆకులు రాలిన చెట్లయినా తిరిగి పురుడు పోసుకుని చిగురించి పచ్చగా ఉండి పూలు కాయలు పండ్లు ఇస్తాయి. సమాజానికి ఉపయోగపడతాయి. నాకెందుకు అనుకుంటే ప్రపంచం ముందుకు సాగేనా? చదువు , తెలివి, సంస్కారం ఉంది అనుకుంటారు కానీ మీరెంత తెలివుతక్కువ వాళ్ళో, ఆలోచనా తక్కువ వాళ్ళో చూస్తుంటే జాలి వేస్తుంది.అమ్మ అని పిలిపిచుకోవడం కూడా వరమే. అందరికి అన్ని అవకాశాలు ఉండవు. అవకాశం ఉన్నవాళ్లు వదులుకోవద్దు. అదీ ధర్మబద్ధంగానే సుమా. ఇప్పుడు పిచ్చి వేషాలు ఎక్కువయ్యాయి. సహజీవనాలు, పెళ్లికాకుండానే పిల్లల్ని కనడం, వాళ్ళను అనాథలుగా చేయడం, వొళ్ళు కొవ్వెక్కి తిరగడం గమనిస్తున్నాం. ప్రకృతిని చూసి మనం నేర్చుకోవాలి. వెర్రి తలలు వేస్తున్న సంస్కారం. తెలివి తమ సొత్తయిన మానవులు ఏమి ఆలోచిస్తారో....తరువాతి తరానికి తెర తీస్తారో. .. గొడ్రాలుగా వద్దు, పిల్లలుంటేనే ముద్దు.

మంచి ఆలోచనలు,మంచి స్నేహితులు మనలను ముందుకు నడిపిస్తాయి. మంచి చెప్తుంటే వినాలి. మూర్ఖత్వ ఆలోచనలకు ఫుల్ స్టాప్ పెట్టండి.అన్ని తెలుసని బొందలో పడకండి. రేపటి గురించి, భవిష్యత్తు గురించి మననం చేయండి. అంతా మన చేతుల్లో. అంతా మన చేతల్లో. చైతన్యం కావాలి, ఉత్సాహంగా ఉండాలి. భయపడితే ముందుకు సాగలేము. ఏ సమస్యైనా ధైర్యంతోనే ఎదుర్కోవాలి. ముందు తరాలకు స్వాగత ద్వారాలు తెరుద్దాం.

ఆలోచించండి అంతా శుభం కలుగుతుంది.ఈ కాలంలో జనులేంటో పిల్లలు వద్దని అసలు పెళ్ళి వద్దనే మహా విజ్ఞానవంతులు తయారయ్యారు...ఎటు పోతుంది ప్రపంచం. చంద్రుని మీదకు కూడా చేరిన గొప్ప జ్ఞాన ఘనులు ఉన్న కాలం లో వున్నాం మరి.



-డా. వీడెల్ల సీతాలక్ష్మి
9490367383

# భావోద్వేగాలకు అక్షర రూపం.. నర్సయ్య కవిత్వం!

ప్రఖ్యాత హాలీవుడ్ సినీ నిర్మాణ సంస్థ మెట్రో గోల్డ్ విన్ మేయర్ (MGM) లోగోలో ఒక గర్జించే సింహం. దాని చుట్టూ కొన్ని అక్షరాలు కనిపిస్తాయి. లాటిన్ భాషలో ఉన్న ఆ అక్షరాలు ARS GRATIA ARTIS! దాని అర్థం కళ కళ కోసమే ART FOR ARTS SAKE అని!

నిజానికి ఎంజీఎం వారి లోగో రూపొందిన 1924 కన్నా వందలాది సంవత్సరాల క్రితం నుండే ఈ చర్చ మేధో ప్రపంచంలో జరుగుతూ వస్తోంది.

కళ కళ కోసమా? కళ ఆత్మానందం కోసమా? కళ సమాజం కోసమా? అనే ప్రశ్నలు మూడు దశలలో కొనసాగుతూ వచ్చాయి.

మొదట్లో కళ, కవిత్వం, సాహిత్యం, ఇతర సృజనాత్మక వ్యాసంగాలన్నీ కళను ఉన్నతీకరించడానికి, ఉదాత్తీకరించడానికి, మరింత సుసంపన్నం చేయడానికి జరిగాయి.

ఆ తర్వాత కళారూపం కేంద్ర స్థానం కళ నుంచి కళను సృష్టించే కళాకారుడికి మారింది.

అప్పుడు కళాకారుడిలో ఉండే భావోద్వేగాలు, ఆలోచనలు, ఆత్మీయమైన అంశాలు ఉపరితలం పైకి వచ్చి దానిని అనుసరించి జరిగేదే కళాసృష్టి కనుక, కళ కళాకారుడి ఆత్మానందం కోసం అనే మాటలు ప్రస్తావనలోకి వచ్చాయి. కళాకారుడి ఆత్మ సంతృప్తి కోసం, తన వ్యక్తిగత భావాల వ్యక్తీకరణ కోసమే కళా సృష్టి జరుగుతుంది అనే వాదనకు బలం చేకూరింది.

ఇక మధ్య యుగానంతర ఆధునిక కాలంలో ప్రజా విప్లవాలు ముఖ్యంగా 1688 నాటి బ్రిటీష్ విప్లవం, 1789 నాటి ఫ్రెంచి విప్లవం, 1917 నాటి రష్యన్ విప్లవం, 1914-18 వరకు జరిగిన మొదటి ప్రపంచ యుద్ధం. 1939-45 వరకు జరిగిన రెండో ప్రపంచ సంగ్రామం అనంతరం ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు, స్వతంత్ర దేశాల అవతరణ వంటివి జరిగిన తర్వాత **"కళ కళ కోసం.. కళ ఆత్మానందం కోసం మాత్రమే కాదు, అంతకు మించి కళ సమాజం కోసం, ప్రజల కోసం, ప్రజల్లో చైతన్యం కోసం"** అనే ఆలోచన మొదలైంది.

ఇలా ఇప్పుడు కళారూపం, కళా ప్రక్రియ ఏదైనా దాని అంతిమ లక్ష్యం ప్రజా చైతన్యం, ప్రజా వికాసంగా రూపాంతరం చెందింది అనే చెప్పాలి.

ఇదే అంశాలని సాహిత్యానికి అన్వయించి మరో మాటల్లో చెప్పాలంటే, సాహిత్య రూపాలైన కావ్యాలు 5 దశలుగా పరిణామం చెందాయని భావిస్తాను.

1. కావ్య సమ్మితాలు
2 కవి ఆత్మ సమ్మితాలు
3 ప్రభు సమ్మితాలు
4 ప్రజా సమ్మితాలు

5 భావజాల సమ్మితాలు

కళలన్నిటిలో విశిష్టమైన, విశుద్ధమైన కళగా, అక్షర కళగా భాషకు, సాహిత్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది.

భాషే పునాదిగా, అక్షరాలే వారధిగా సృష్టించే సాహితీ కళా రూపాలు, ప్రక్రియలన్నింటిలో కవిత్వం మరింత శ్రేష్ఠమైందిగా ప్రశంసలు పొందింది.

ఎందుకంటే అర్థవంతమైన అక్షరాలతో పొదిగిన కావ్యం పాఠకుడిలో అక్షరాలను మాత్రమే కాక దృశ్యాలను కూడా ఊహించు కునే అవకాశాన్ని కలిగిస్తుంది.

పాఠకుడి మెదడులో కొత్త ప్రపంచాన్ని సృష్టించే సృజనాత్మక నైపుణ్య విలువలను పెంచుతుంది.

ఇక కవిత్వం- పాఠకుడిలో ఊహను, ఆలోచనలను మాత్రమే కాకుండా కర్తవ్యాన్ని చైతన్యాన్ని సృహను కూడా కలిగిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

అందుకే కవిత్వం- వినోదానికి వికాసానికి, ఆ విజ్ఞానానికి మాత్రమే పరిమితం కాలేదు.

విప్లవానికి కూడా అది ఎదిగింది.

**అందుకే కవిత్వం వానలా కురిసింది!**

**అగ్నిలా మండింది!**
**నదిలా ప్రవహించింది!**
**గాలిలా వ్యాపించింది!**
**ఆకాశంలా విస్తరించింది!**
**చెట్టులా మొలుచుకొచ్చింది!**
**అన్నిటినీ మించి భూమిలా పరుచుకున్నది!**

కవికి నిలిచే చోటునిచ్చి ఆధారమైంది! కవిని తనపై నిటారుగా నిలిచేలా చేసింది! కవిని తన దేహంపై నడిచేలా ప్రోత్సహించింది!




**ప్రతులకు:** డా॥తూము నర్సయ్య
ఇ.నెం.13-1-105
తిలక్‌నగర్, గోదావరిఖని
రామగుండం,
జిల్లా: పెద్దపల్లి-505 209

**డా॥ తూము నర్సయ్య రచించిన "నేను మీ నాను" పుస్తకానికి మామిడి హరికృష్ణ రాసిన ముందుమాట.**

అంతేగాక కవిత్వంలో సంక్షిప్తత, స్పష్టత, తాత్వికత, లోతైన భావన, విశాల మానవీయత, సౌందర్యాత్మకత వంటి లక్షణాలు సహజంగా ఒదగడం వల్ల కవిత్వం సాహితీ ప్రక్రియల్లో తనదైన ముద్రని, విశిష్టతని సాధించింది. అందుకే సాహితీవేత్త లందరి గమ్యం కవిగా కవిత్వాన్ని సృష్టించడంలోనే సార్థకమైనట్లుగా భావిస్తారు.

ఇలాంటి నేపథ్యంలో ప్రపంచ సాహిత్యంలో, భారతీయ సాహిత్యంలో, తెలుగు సాహిత్యంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త శైలి, వస్తువులతో, నవీన ప్రక్రియలతో, నవ్యపోకడలతో కవిత్వాన్ని సృష్టిస్తున్న కవులు తర తరానికి పుడుతూనే ఉన్నారు.

కొన్ని వేల సంవత్సరాల నుంచి సాహిత్య సృష్టి, కవిత్వ సృష్టి జరుగుతున్నప్పటికీ ఇంకా కవిత్వం ఎందుకు పుడుతుంది?

ఇదొక మంచి ప్రశ్న!

ఇప్పుడే కాదు.. ఇంకా రాబోయే కాలంలో కూడా మానవుడు ఉన్నంత కాలం, మానవ భావోద్వేగాల్లో చలనం, స్పందన ఉన్నంత కాలం సాహిత్యాన్ని, కవిత్వాన్ని నిరంతరం ప్రతీతరం సృష్టిస్తూనే వెళుతుందని నేను భావిస్తాను.

ఎందుకంటే మానవుడు నిరంతర గతిశీలి! నిరంతర చైతన్యశీలి! నిత్యం తనని తాను అన్వేషించుకుంటూ, చెక్కుకుంటూ, మలచుకుంటూ, పరిస్థితికి, పర్యావర ణానికి, ప్రకృతికి అనుకూలంగా వెళుతూ, కొన్ని సందర్భాలలో ఎదిరిస్తూ తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తూ ఉంటాడు. ఆ క్రమంలో..

1) ప్రకృతికి తనకు 2) తనకు సమాజానికి 3) తనకు తనలోని అంతర్గత మానవుడికి జరిగే సంఘర్షణలు వ్యక్తం చేయడానికి కవిత్వాన్ని ఆశ్రయిస్తాడు.

ఆ లెక్కన భాష పుట్టిన తొలినాళ్ళ నుంచి, లిఖిత సాహిత్యం విస్తరిల్లిన కాలం నుంచి, నేటి ఆధునిక అంతర్జాల నేపథ్య సమాచార విజ్ఞాన పరంపర కొనసాగుతున్న కాలం నుంచి, రేపటి AI తరం తర్వాత కూడా కవిత్వం సజీవనదిలా ప్రవహిస్తూ కొనసాగు తుంది.

అలా ఎప్పటికప్పుడు మానవుడు తనలోని ఆలోచనల్ని, భావ విశేషాలని, ఉద్వేగాలను అక్షరీక రిస్తూ, కవిత్వంగా వెలిగిస్తూ, తనను తాను తెలుసుకుంటున్నాడు వ్యక్తీకరించుకుంటున్నాడు.

**అందుకే కవిత్వం ఒక స్వీయ ప్రక్షాళన!**

**కవిత్వం ఒక స్వీయ అన్వేషణ!**

**కవిత్వం ఒక సంవేదన! కవిత్వం ఒక సామాజిక స్పందన!**

ఇలా ఎప్పటికప్పుడు ప్రతి తరంలో కవులు తమ తమ భావాలకి పదును పెడుతూ,

తమ ఆలోచనల్ని ముందుకు తీసుకెళ్తూ, అక్షరాల్లో నిక్షిప్తం చేస్తూ కవిత్వంగా వలపోస్తున్నారు.

అలాంటి సమకాలీన తెలుగు కవులలో నేటితరం కవి నర్సయ్య! తాను వృత్తిరీత్యా ప్రభుత్వ ఉద్యోగి.

నిత్యం ప్రజా సంబంధాలలో తలమునకలయ్యే జిల్లా కలెక్టర్ గారికి క్యాంప్ క్లర్క్‌గా దశాబ్దాల కాలం నుంచి గురుతరమైన సేవలని నిర్వర్తిస్తూ, ప్రజల కష్టాలని, సమస్యలని అతి సమీపం నుంచి గమనించిన వ్యక్తి!

ఒక వ్యక్తి కవి కావడానికి ఇంత కన్నా గొప్ప ప్రేరణ, అనివార్య పరిస్థితి ఏముంటుంది?

కష్టాలని కన్నీళ్లని, ఆనందాన్నీ, ఉద్వేగాలని దగ్గరుండి చూసే అవ కాశం వృత్తిరీత్యా లభి ంచినా, ప్రవృత్తి రీత్యా స్పందించే హృదయం మనలో ఉంటే ఆ మనిషి మంచి కవిగా రాణి స్తాడనడంలో ఎలాంటి సందేహం లేదు. అదే నర్సయ్య విషయంలో కూడా జరిగింది.

అందుకే ఆయన తన జీవన ప్రస్థానంలో తనకు ఎదురైన సంఘటనలు, వ్యక్తులు, సన్నివేశాలు, పరిస్థితులు, సందర్భాలు, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక ఉద్దీపనలు అన్నింటి చేత ప్రభావితమై, ప్రతి అంశం పట్ల తనదైన ప్రత్యేక ధోరణిని, స్పందనని, సంవేదనని ఈ కవితా సంపుటిలోని వివిధ కవితల ద్వారా వ్యక్తీకరించాడు.

నర్సయ్య కవిత్వంలో పాండిత్యం కంటే పరివేదన, సాహిత్య ఆడంబరం కంటే స్పందన ఎక్కువగా కనిపిస్తాయి.

ఆయన రాసిన ఈ కవితా సంపుటిలోని కవితలు అన్నింటినీ గమనిస్తే వాటిని ఈ క్రింది కోణాలుగా చెప్పవచ్చు.

### 1) మహనీయులు:

సర్వేపల్లి రాధాకృష్ణ, శ్రీనాథుడు, భగత్‌సింగ్, అల్లూరి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, అందెశ్రీ, అంబేద్కర్, దాశరథి వంటి మహనీయుల గురించి తనదైన శైలిలో సాహితీ నివాళి అర్పించారు.

### 2) మాతృదేశ శక్తి:

నర్సయ్య తన కవిత్వంలో సందర్భం వచ్చిన ప్రతిసారీ తన దేశం, రాష్ట్రం పట్ల, తాను పుట్టి పెరిగిన ఊరు పట్ల తన అభిమానాన్ని, అనురాగాన్ని, అక్షరీకరిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే దేశభక్తి గురించి, తెలంగాణ తల్లి, సైనికుల గురించి, భారతీయత, మువ్వన్నెల జెండా, వందేమాతరం, రామగిరి ఖిల్లా గురించి ఎన్నెన్నో కవితలని చక్కగా మన ముందు ఆవిష్కరించారు.

### 3) ఉత్సవాలు, పండుగలు:

ఒక మనిషికి జీవన ఉత్సాహాన్ని కలిగించేవి సంప్రదా యంగా వస్తున్న పండుగలే అని చెప్పవచ్చు.

అవి సంస్కృతిలో, సంప్రదాయంలో, మన జీవితంలో అంతర్భాగంగా కొనసాగుతున్న ప్పటికీ వాటిలోని అంతర్లీన సందేశాన్ని తెలుసుకోవడం ద్వారా మన జీవన గమనాన్ని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుంది. అలా నర్సయ్య వినాయక చవితి, శ్రీరామనవమి, విజయదశమి, దీపావళి, సంక్రాంతి, ఉగాది, గణపతి నవరాత్రి ఉత్సవాలు వంటి అంశాలపై వేర్వేరు కవితలను తనదైన కోణంలో ఆవిష్కరించారు.

### 4) ప్రేమ-ఊహా ప్రేయసి:

భావ కవితా కాలం, అంతకు ముందు నుంచి కూడా ప్రతి మనిషిని వెంటాడే కవితా వస్తువు ఊహా ప్రేయసి! నర్సయ్య కూడా ఇందుకు మినహాయింపు కాదు. వ్యక్తిగా తనలోని ప్రేమను, తను ఊహించిన, ఆశించిన, ఆకాంక్షించిన ప్రేమను, మానవుల మధ్య, మానవ సంబంధా లలో వుండాల్సిన ప్రేమ ఆవశ్యకతను వేరు వేరు కవితలలో బలంగా వినిపించాడు.

దాంతో పాటు తన ఊహా సుందరిని ఊర్వశిగా, తిలోత్తమగా ఊహిస్తూ భావగర్భితమైన కవితలని రాశారు.

### 5) ఆత్మీయ కవితలు:

సున్నిత మనస్తత్వాన్ని కలిగిన నర్సయ్యకు అమ్మ నాన్న అంటే ఎంతో ఇష్టం. గురువుగారు అన్నా ఇష్టమే.

ఇక పునాదిగా నిలిచే బాల్యాన్ని ఎలా విస్మరిస్తారు? అలాగే భార్య పట్ల ఉండే అనురాగాన్ని ఎలా కాదనుకుంటారు? నర్స య్య కూడా అదే పని చేశాడు. తను పుట్టి పెరిగిన రామగిరి ఖిల్లా గురించి, తన సహధర్మ చారిణి గురించి, నాన్న, గురువు గురించి చక్కని కవితలు రాశారు. భార్య మువ్వల సవ్వడికి ఫిదా అయిన తీరుని సున్నితంగా వ్యక్తీకరించారు.

### 6) సామాజిక చైతన్యం:

సమకాలీన పరిస్థితుల నేపథ్యంలో మారిన సామాజిక పరిస్థితులలో మనుషుల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ, ఎప్పటికప్పుడు తన అక్షరాలు సంధిస్తూ, పాఠకులను చైతన్యం కలిగించే ప్రయత్నం చేశారు.

మత్తు, ఇతర వ్యసనాల పైన, అనివార్యంగా సామాజిక రీతిలో పెరుగుతున్న విడాకుల ధోరణి పైన, అంతర్జాలం మాయలో పడి కొట్టుకుపోతున్న మానవాళి తీరుపైనా, ఆడపిల్లలపై వివక్ష పైన చక్కని కవితలని ఇందులో సంకలనం చేశారు.

అలాగే ప్రపంచమంతా రాజకీయం అయిపోయిన ప్రస్తుత నేపథ్యంలో నర్సయ్య కూడా తన అక్షరాలని అందిస్తూ ఓటు, రాజనీతి, ప్రజా సేవ శీర్షికలతో రాజకీయంగా ప్రజలు మేల్కొనాలసిన పరిస్థితిని, బాధ్యతని గుర్తించాల్సిన స్థితిని చిన్ని చిన్ని చురకలుగా అందించారు.

ఇక ఆయన రాసిన కచ్చురం కవిత ఇప్పుడు కనిపించకుండా పోయినా, ఒకనాటి తెలంగాణ సాంస్కృతిక చిహ్నమైన ఎడ్ల బండికి మళ్లీ సాహిత్యంలో పున ప్రతిష్ఠ చేసిన అనుభూతి కలుగుతుంది. కచ్చురంలో ఉండే వివిధ భాగాలను ఉటంకిస్తూ రాసిన ఈ కవిత కొన్ని దశాబ్దాల క్రితం గ్రామీణ ప్రాంతాలలో, పల్లెపట్టుల్లో, వ్యవసాయ కుటుంబాల్లో అంతర్భాగంగా ఉండేది. రాకీలు, సంక పాప కట్టే, సిక్కం, నోగలు, ముక్కెర శీల, బొడ్డు శీల, చక్రం శీల, కన్నాలు, గారే అనే అచ్చమైన స్వచ్ఛమైన తెలంగాణ వస్తు సంస్కృతి పదసంపదను ఈ కవితలో స్పష్టంగా వ్యక్తీకరించడం విశేషం. ఇలా నర్సయ్య తన హృదయంలో జరిగే సంచలనాలను, తన మేధస్సులో పుట్టే ఆలోచనలను అక్షరీకరిస్తూ, కవితలుగా రాస్తూ, తనని తాను అన్వేషించుకుంటూ అభివ్యక్తి చేసుకుంటూ, అనుభూతి చెందుతూ, వాటన్నిటినీ అక్షర రూపంలో మన ందరికీ ఈ పుస్తకం ద్వారా అందిస్తున్నారు.

**అభివృద్ధి కవిత్వానికి**
**తొలి అడుగు అయితే**
**ఆ అభివృద్ధితో పాటు అనుభూతిని మేళవించి**
**అక్షరాలుగా పొదిగిన నర్సయ్య కవిత్వం**

నిజాయితీతో కూడినసాహితీ ప్రయత్నంగా భావిస్తూ.. శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



-డా॥మామిడి హరికృష్ణ

# "ధ్వనించే గుడి గంటలు, వెలిగే దీపాలు ఏ మతమైనా మానవత్వమే"






షేక్ కాశింబి "వెన్నెల పుష్పం" దీర్ఘ కవితలో, "మతం" ఇంటికే పరిమితమై, మమత వెన్నెల పుష్పంలా, లోకమంతా విరియాలని ఆకాంక్షిస్తారు. ఆత్మవేదనా నివేదనగా రూపుదిద్దుకున్న ఈ దీర్ఘ కవిత మానవత, మమతా దీపం వెలిగిస్తోంది. మతాన్ని, భక్తి భావనను జ్ఞాన దీపంగా మందిరం, మసీదు, చర్చి, గురుద్వార్‌ల ను అద్భుత ఆధ్యాత్మిక మార్గాలని అన్నింటి అంతస్సూత్రం ధర్మాచరణే అని సూచించారు. సమాజంలో విశృంఖలంగా పెరుగుతున్న ఉగ్రవాద ధోరణులపై ఆమె కవితాత్మక స్పందన, రాజకీయాల గుట్టు కనిపెట్టమని, అందరికి సమానత్వపు తేనెరుచిని అందించి ఆదరించాలని అభిలషించారు. మనిషిపేరు అడక్కుండా మంచి నీటినీ, కులం పేరు అడక్కుండా అద్దె ఇంటినీ, ఇంటి పేరు అడక్కుండా 'షేక్ హ్యాండ్' ఇవ్వగలిగే సంస్కారవంతమైన స్వచ్ఛ సమా జాన్ని నిర్మించుకుందాం రండి! అంటారు కవయిత్రి. వెన్నెల సౌందర్య భావన, పుష్ప పరిమళం గుబాలించే ఈ కావ్యం అక్షరా క్షరం షేక్ కాశింబి, జీవన ఆకాంక్ష హృదయతత్త్వానికి అద్దం పడ్తోంది.

ప్రేమ, కరుణ, స్నేహం, దయ, శాంతి, సంతోషాలతో అందరూ జీవించాలని, మతాలు కులాలు పేర్లు ఏవైనా అవన్నీ సమానమేనని సమాజహితాన్ని ప్రసాదించే భావనలను నిరంతరం పచ్చగా ఉంచుకోవాలనేది ఆమె అభ్యర్థన. దేశాన్ని పాలించే మేధావుల ఆలోచనల స్థితిగతులు మారు తున్న ప్రస్తుతంలో ఇలాంటి రచనలు, రావటం ఆహ్వానించతగ్గ పరిణామం.

మహాత్ముడు ఆశించిన సత్యాహింసలు, డా॥ అంబేద్కర్ పోరాడిన సామాజిక న్యాయం, భారత ప్రజాస్వామ్య లక్ష్యమైన శాంతి, సమానతా విలువలు, మత సంయమనం, మత సంహనం సౌభ్రాతృత్వపు పరిమళంతో వికసించిన వెన్నెల పుష్పం రచయిత్రి సదా అబినందనీయురాలు.

**ప్రతులకు:** శ్రీమతి షేక్ కాశింబి
సెల్:9052216044



-జయసూర్య
సెల్: 9440664610



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఈ వారం వచన కవితల వర్క్ షాప్...అంశం "ఓటు". విజేతల కవితలు చదవండి.

-డా॥రావి రంగారావు
9247581825

-సంపాదకులు

### ఓటు ఆయుధమే...

ఓటంటే...
వేలిపై నల్లటి చుక్క కాదు!
దేశ పటంపైన
నువ్వు చేసే భవిష్యత్ సంతకం!
ప్రజా సామ్యానికి అక్షయ కవచం!.
ఐదేళ్లకోసారి వచ్చే
జెండాల రంగుల వెనుక
ఎజెండా లేని కూటములు
కుల మతాల కపట వేషాలు!
నిన్నటి శత్రువుల
నేటి వికృత కౌగిలింతలు!.
నేడు ఓటంటే...
అంగడి సరుకా?
నోట్లకు, క్వాటర్లకు, బిర్యానీలకు
అమ్ముడు పోయే దాస్యమా?
నువ్వున్నా లేకున్నా
నీ హక్కును దోచే దౌర్భాగ్యమా?.
పోరుడా మేలుకో...
ఓటు అపరిమిత శక్తి!
అహంకారాన్ని కూల్చే ప్రళయాగ్ని!
ఓటుతో కోటలు కట్టిన వారున్నారు,
అదే ఓటు దెబ్బకు
మట్టిలో కలిసిపోయిన వారూ ఉన్నారూ!.
ఓటును చులకన చేయకు...
అది రేపటి తరాలకు దిక్సూచి!
కాలాన్ని మార్చే కాల భైరవుడు!.
ఓటు ప్రజా స్వామ్యానికి ప్రాణ వాయువు!
నీ చేతిలోనే సార్వభౌమాధికారం..
అమ్ముకుంటే... ఐదేళ్ల బానిసవి!
ఆలోచిస్తే... ఐదేళ్ల ఏలికవి!
తీర్పు నీ వేలి కొనపై ఉంది!
భవితవ్యం నీ ఆత్మ సాక్షి చేతిలో ఉంది!
ఓటును అమ్మకు... శాసించు!
ఓటును ఆయుధం చేయి... చరిత్రను నిర్మించు!

-బాబురావు చల్లగాలి,
9941469728

### ఆర్టికల్ 326

నీ చుట్టూ స్వచ్ఛమైన
నవ్వులు విరబూయాలనుకుంటావో
కష్టాల పల్లేరులను కలగంటావో
అంతా నీ చూపుడు వేలుకే ఎరుక !.
అవకాశ వాదుల అనుచితాల పల్లకీలో ఊరేగుతావో
స్వశక్తి నడిపించే నిజాయితీ బాటల్లో సాగుతావో..
నోటా చెప్పినా
అంతా నీ చూపుడు వేలుకే అర్హత!!.
నీ అవసరాల అజెండాపై
వాళ్ళ అవినీతి సంతకాల్ని కోరుకుంటావో,
నీ కోసం నిలబడే నిఖార్సైన వ్యక్తికై
చూపుడువేలుపై మరకను స్వాగతిస్తావో
నీ విచక్షణదే భవితవ్యం!!.
పుచ్చిన స్వార్థపు కుర్చీలకు నీ భుజాలు అడ్డుపెట్టి
ఏళ్ల తరబడి ఎక్కించిన అందలాల కింద
నామరూపాల్లేక నలుగుతావో
నీ ఉనికిని నిలబెట్టి ఆత్మ గౌరవాన్ని కాపాడే
ఛత్రం నీడలో నిలుస్తావో
నీ పదునైన చూపుడువేలు కరవాలానిదే నిర్ణయం!.
తీయని మాటల దారాల్తో
నీ నోరు కుట్టేసిన చేతుల్ని తెగ్గొడతావో..
వివక్షతల కుమ్ములాటలో నిను తొక్కేసే
రాజకీయ చదరంగపు ఎత్తుల్ని
వివేచనా చక్షువులతో నిలువరిస్తావో
అంతా రాజ్యాంగం నీ కిచ్చిన ఆర్టికల్
326 అక్షయ తూణీరానిదే లక్ష్యం!.
ఊరించే ఉపకారాల కళ్ళజోడు పెట్టించుకోక
వివేక నేత్రం విప్పిచూసి
పూటకో పథకాల ఉచ్చులో పడక
నీకోసం ధర్మం పక్షాన నిలబడి
దేశ ప్రగతి రేఖల్ని ప్రపంచ యవనికపై
గీయగల సమర్థుడికి అండ కావాలి
నీ చేతిలో వజ్రాయుధం !!

-అమృతవల్లి అవధానం
9052912120.

### ఓటుకు ఆత్మ ఉంది

ఓటుకే గనక నోరు ఉంటే,
నోటు వద్దనేది... ప్రశ్నించేది,
ఆకలి విలువేంటో చెప్పమనేది!.
ఓటుకే గనక ఆలోచన ఉంటే,
అబద్ధాలను నమ్మవద్దనేది...
నిజమేంటో నిలదీసేది!.
ఓటుకే గనక గుండె ఉంటే,
ప్రజాస్వామ్య స్పందనతో కొట్టుకునేది...
ప్రజా స్వరాన్ని వినిపించేది!.
ఓటుకే గనక ముక్కు ఉంటే,
మందు వద్దనేది...
మత్తులో ముంచని పరిపాలన అడిగేది!.
ఓటుకే గనక చూపు ఉంటే,
బిర్యాని కాలక్షేపం వద్దనేది...
నా ఔన్నత్యాన్ని తగ్గించవద్దనేది!.
ఓటుకు ఆత్మ ఉంది... అది మనలోనే వెలుగుతుంది,
కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది,
చైతన్యంతో మనల్ని ఉన్నతులను చేస్తుంది!

-బి కోమల సత్యవతి
9989963383

### అస్త్రం

రాజ్యాంగం ఇచ్చిన వరాన్ని
ఉచితాల గాలానికి తగిలించి
ప్రలోభాల వలలో చిక్కి
వివశుడివై విల విల లాడుతావెందుకు?.
అరచేతిలో వైకుంఠాన్ని చూపి
బ్రతుకుల్ని పాతాళానికి తోస్తున్నా
మారుతున్నది జండా రంగులే కానీ
నీ బ్రతుకు రంగు కాదని గుర్తించవెందుకు?.
కులం సంకెళ్లలో నలుగుతూ
మతం మత్తును గ్రోలుతూ
దోపిడీ దొరలకే పట్టం కడుతూ
దొంగల రాజ్యమయ్యిందని
విస్తుబోతావెందుకు?.
సురాపానం మైమరపుకు
సిరాచుక్కను తాకట్టు పెట్టి
ప్రశ్నించే గొంతును అదిమేసి
తరాల భవితకు ఉరితాడు ను
సిద్ధం చేస్తున్నా వేందుకు?.
ఓటును విజ్ఞత తో వేస్తే
పాలకులకదే వేటువిచక్షణను మరిచేస్తే
ప్రగతి కే గ్రహపాటనే
వివేకాన్ని వీడుతున్నా వెందుకు?.
ఓటంటే ఓ సిరాచుక్క కాదు
తరాల తలరాతని మార్చే
సంతకమేనని గుర్తుంచుకో!

-మేడిశెట్టి సుభద్రా కృష్ణ
7396959347

# సినిమా చూపించిన నవల

పుస్తక సమీక్ష







ప్రతులకు:
ఎస్.ఎం.రావు
ఇ.నెం.19-14/1,
రవీంద్రనగర్ కాలనీ
హబ్సిగూడ,
హైదరాబాద్-500 007

'బంధం' అనే పదం చాలా విశిష్టమైనది. లోతైనదీను! ఈ పిల్లల నవలలో ఎవరెవరి మధ్య? అన్న ప్రశ్నకు సమాధానం! కౌమారదశలోని అనుజిత్, తల్లి సుమిత్ర, తండ్రి మాధవరావుల మధ్య, పని మనిషి మేనకోడలు పదేళ్ళగౌరి మరియు అనుజిత్‌ల మధ్య, సైకియాట్రిస్ట్ రజని, అనుజిత్ మరియు అనుజిత్ అమ్మా, నాన్నల మధ్య అని చెప్పుకోవచ్చును.

రచయిత్రి శ్రీ ఎస్.ఎమ్ ప్రాణ్‌రావుగారు 'బంధం'ను పిల్లల నవల అన్నారు. కాని కౌమారపు వయసు పిల్లలని తలి దండ్రులు ఎట్లా అర్థం చేసుకోవాలో, తెలుపుతుంది ఈ నవల. కౌమారపు వయసు పిల్లలు, అమాయకంగా ఏమీ తెలియనట్లు ఉంటారే, కాని వారి గ్రాహ్యత అవగాహన, ప్రపంచాన్ని, పరిసరాలనీ వారి తలి దండ్రులను ఎంతటి నిశితంగా పరి శీలిస్తారో ఈ నవల తెలియపరుస్తుంది.

బంధం నవల రచయిత ప్రాణ్ రావు 83 ఏళ్ళ పరిణత వయస్కుడు. సినిమా స్క్రిప్టు రచయిత. చరిత్రలో ప్రసిద్ధ వ్యక్తుల పట్ల ఎనలేని ఆసక్తి. కథను కళ్ళకు కట్టించటం సినిమా స్క్రిప్టు ముఖ్య ఉద్దేశము. స్క్రిప్టు సినిమాకు పునాది వంటిది. ప్రేక్షకుడు, నటులు, నిర్మాత దర్శకుడు వీరినందరినీ దృష్టిలో పెట్టుకుని స్క్రిప్టు వ్రాయవలసి ఉంటుంది.

వరంగల్లు నగర శివారులో పిల్లల గల్లీ క్రికెట్ ఆటతో నవల ప్రారంభం అవుతుంది. రెండు బ్యాచీల మధ్య ప్రతిష్టాత్మకమైన పోరు. ఆఖరి బాలు, ఉత్కంఠం. అనుజిత్ అనే కుర్రాడు బాల్‌ను 'క్యాచ్' చేసి జట్టును గెలిపిస్తాడు. కాని ఈ క్రమంలో బోర్లా పడతారు. రక్తం కక్కుకుంటాడు. తలిదండ్రులు హాస్పిటల్ తీసుకెళ్తే, అబ్బాయికి 'బ్లడ్ కేన్సర్' ఉన్నట్లు తెలుస్తుంది. ఎంతో ఖర్చు. సామాన్యులకు వచ్చే జబ్బు కాదు. ఫలితం దైవాధీనం. స్కూలుకు మాని ఇంట్లోనే అనుజిత్ ఉండి ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. కౌమార వయస్కుడు అనుజిత్ ఒంటరిగా ఇంట్లో ఉండి ట్రీట్‌మెంటు తీసు కోవటం, విసుగ్గా ఉంటుంది. జబ్బు వివరాలు తలిదండ్రులు చెప్పరు అయినా, పిల్లవాడికి తెలుస్తుంది. అనుజిత్‌ను వేరే వ్యావకాల మీదకు మళ్ళించేందుకు తలి దండ్రులు సాయ శక్తులా కృషి చేస్తుంటారు. డ్రాయింగ్‌లో ప్రావీణ్యత ఉన్న అనుజిత్ చిత్రలేఖనంలో కూడా, మృత్యు సంబంధిత విషయాలనే ఎన్నుకుంటాడు. అనుజిత్ ప్రవర్తనతో మార్పు వస్తుంది. చీటికి మాటికి చికాకు పడుతుంటాడు.

సామాన్య కుటుంబీకులైన తలిదండ్రులు సుమిత్ర మాధవరావులకు అనుజిత్ చికిత్స ఆర్థికంగా భారమైనా, సుమిత్ర ప్రయివేటు స్కూల్లో జాయిన్ అయి, మాధవ రావు అదనంగా లెక్కలు రాసి కొంత డబ్బు సంపాదించే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అయినా, వారింట్లో ఒక నిరాశా పూరిత వాతావరణం నెలకొని ఉంటుంది. డాక్టర్ సలహా మీద అనుజిత్‌ను డా॥నళిని అనే సైకియాట్రిస్ట్‌కు చూపెడుతారు. ప్రత్యేక శ్రద్ధతో రజిని అనుజిత్‌ను మానసికంగా ఉల్లాసపరిచేందుకు ప్రయత్నిస్తూ ఉంటుంది.

అనుజిత్‌కు 'గౌరి' అనే పనిమనిషి మేనకొడలు .10-12 ఏళ్ళ వయస్సు గల అమ్మాయి. పరిచయం అవుతుంది. గౌరి కనబరిచే ఉత్సుకత. అమాయకత్వం. పసి మనసు ప్రవర్తన అనుజిత్‌ను ఆకర్షిస్తుంది. ఇద్దరూ సన్నిహితంగా మెలుగుతుంటారు. తల్లి సుమిత్రకు ఇది నచ్చదు. గౌరి చూపే ఆదరణ, తల్లి నిరసనల మధ్య అనుజిత్ గౌరిపట్ల ఎక్కువ మొగ్గు చూపుతుంటాడు.

ఒకరోజు ఇద్దరూ వరంగల్లు కోట దగ్గరకు వెళ్ళి ఆడుకునే క్రమంలో అనుజిత్ క్రింద పడిపోతాడు. రక్తం కక్కుకుని. హాస్పిటల్ డాక్టర్లు ట్రీట్‌మెంటు వరీక్షల మధ్య నవల ముగుస్తుంది.

కేన్సరు రోగులు వారి మానసిక స్థితి, వారినెట్లా 'ట్రీట్' చెయ్యాలో వివరంగా వెల్లడించిన ఈ నవల, పిల్లలకే కాదు, పెద్దవారికి కూడా, విజ్ఞాన దాయకంగా ఉండేందుకు రచయిత ప్రాణ్‌రావు గారు, శ్రద్ధ తీసుకుని, కేన్సర్ రోగుల మానసిక స్థితి పట్ల మంచి అవగాహన ఏర్పర్చుకుని రాసిన నవల ఇది. సినిమా స్క్రిప్ట్ రైటర్‌గా ప్రాణ్‌రావు గారు ప్రతి సంఘటనను కళ్ళ కు కట్టించారు.



-కూర చిదంబరం
సెల్:8639338675

# ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి

ఎనిమిది యుద్ధాలను తానే ఆపానని భుజాలెగరేసి చెప్పిన
పొంకాల పోశన్న
బింకాల బీసన్న
సుంకాల సుంకన్న
నోబెల్ శాంతి బహుమతి తనకు రాలేదని
ఇక ప్రపంచంలో ఎవరినీ శాంతిగా ఉండనివ్వనని
తొమ్మిదో యుద్ధానికి తానే తొడగొట్టిండు
తానే అంటే తందానా అనే నెతన్యాహూ తోడయ్యిండు
ఇక ఏ దేశాల వారూ తోడు రాలేదు
ఇరాన్ కు అణ్వాయుధాలు ఉండరాదనే మిషతో
యుద్ధానికి ముందే ఖమానీని , అతని అనుచరులను ఖతం చేసిండు
ఇరాన్ ను ఎన్నో రకాలుగా ఇరుకున పెట్టిండు
ఈ క్రూడ్ ఫెలో తో క్రూడ్ ఆయిల్ ధరలు కొండెక్కాయి
ఇక అన్నిటి ధరలూ చుక్కలంటాయి
ఏదీ కొనలేక తినలేక ఆకలి చావులు చావాల్సి వస్తుందేమో
పొగలు కక్కే ఇరానీ చాయ్ వేడి త్వరగా చల్లారనట్లే
పగలతో పరాభవాలతో రగిలిపోతున్న ఇరాన్ యుద్ధమూ
ఇప్పట్లో చల్లారేటట్లు లేదు
అయ్యా మ..ఘ..వ ట్రంప్ గారూ ప్రపంచాననే
బలవంతులు మీరు
బలహీనుణ్ణి కసి కసిగా మసి చేయడం యుద్ధనీతి కాదు
మీ పెంటగానులలో పెంటకుప్పల్లా అణ్వాయుధాలు ఉండొచ్చు
మీ మిత్ర దేశాలలో కూడా అణ్వాయుధాలు ఉండొచ్చు
ఇదెక్కడి న్యాయం
ఇరాన్ ను అణ్వాయుధాలను చేసుకోనివ్వండి
అప్పుడు ఇద్దరూ సమవుజ్జీలై అణ్వాయుధాలను వేసుకోండి
ఎంచక్కగా
ప్రపంచాన్ని భయంకర జ్వాలల్లో భస్మీ పటలం కానివ్వండి
దానితో మా నకనకలాడే ఆకలి పోరాటాలూ అంతరిస్తాయి
అప్పుడు మీ ప్రేతాత్మ నోబెల్
శాంతి బహుమతిని
అందుకుంటుంది వికటాట్టహాసంతో...



-ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి
సెల్:9492047027



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

-సంపాదకులు

### రైతు బాగుంటేనే దేశం బాగుండు

రైతు బాగుంటేనే దేశం బాగుండు
రైతే కదా మనకు అన్నం పెట్టే అన్నదాత
రైతు సంక్షేమమే దేశ సంక్షేమం ఔతుంది
రైతుకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉంటుంది.
అతివృష్టితో రైతు నష్టపోతుండాడు
అనావృష్టితో రైతు కమతం ఎండిపోతుంది
అలాంటి పరిస్థితులలో
ప్రభుత్వం రైతును ఆదుకోవలె
అతనికి అందరం అండగా ఉండవలె.
దేశానికి వెన్నెముక రైతు అని అంటాము
కాని హాలికుని ఆత్మహత్యలను ఆపలేకపోతున్నాము
నిరంతరం అప్పులతో హాలికుడు
సతమతం ఔతూనే ఉన్నాడు.
రైతు విసిగి వేసారి పొలం అమ్ముకుని
పట్టణాలకు వలస పోతూ ఉన్నాడు
వ్యవసాయ కమతాలు నానాటికీ తగ్గి
భవితలో కరువు కాటకాలు రావచ్చు.

-అక్కి నర్సింలు గౌడ్

### రైతుల విలువ

రైతు అంటే నల్ల రేగడి సాళ్ల నడమ
నిగనిగలాడే తలిరుటాకుల సౌందర్యం!
పొలం గట్టుపై పారపట్టి వంచిన నడుము
అంబరాన సంబరం చేసే సింగిడి అందం!!.
గంజితో పెదాలు తడుపుకొని నవ్వుతూ,
గండాలు ఎన్నెదురైనా సింహం లా గర్జిస్తూ ,
"గుండిగల" నిండా వండిన అన్నం పంచుతూ ,
గుండెకు పడిన పెద్ద గండిని పూడ్చుతూ!!.
ఎన్నిసార్లు నరికినా, మొట్టు చిగురించి నట్టు
విత్తిన వెంటనే పురుగులు చీమలు తిన్నా
వర్షాభావంతో విత్తనం మట్టిలో పొట్లి పోయినా
పెళ్ళాం మెళ్ళో తాళి తాకట్టు పెట్టి పెట్టుబడి పెట్టు!!.
దానిని,ఎవరైనా చూశారా లేదా! ఎప్పుడైనా విన్నారా !
పాచికలతో పరాచికాలాడే పండితుని కన్నారా !
కాలంతో జూదమాడే కలియుగ దైవాన్ని దర్శించారా !
లేదంటే, చూడండి
మన్నును జున్నుగా చేసే, మాంత్రికుని!!.
అతడే అతడే మన రైతు, అతను చేసే కవాతు,
మానవాళి మనుగడకు ఆధారభూతమైన మేత,
బండల్లో గుండ్లలో పనికిరాని భూములను చూసి,
పారా పలుగులతో చక్కని పాటు చేసి పంట వేసి!!.
చిలుకల గుంపు, పిచ్చుకల రచ్చ, ఉడతల ఉరుకు,
ఎలుకల బొరియలు, చీమల పుట్టలు, జీవాల దాడి,
అదేమరి,ఆహారం ఇది, అన్నిటికి కావాలి ఈ సరుకు,
తరగలేదు జాలి, బెదిరించ లేదు ఎప్పుడు ఆ దాడి!!.
అందుకే,రైతు మహనీయుడు మహిలో మహారాజు
క్షామంలో కూడా క్షేమం కోరే స్థితప్రజ్ఞుడు క్షేత్రజ్ఞుడు,
మరి ఆ రైతుకు నమస్కరిద్దామా! కోటి నమస్సులతో!!.

-కేశరాజు వేంకట ప్రభాకర్ రావు
సెల్: 2816 979 82.

### "ఆకలి తీర్చే అన్నదాత "

వర్షం చినుకుతో స్పందించే హృదయం
మట్టి వాసనలో జీవించే అమాయకత్వం
నీటిబొట్టు కోసం నేల నుంచి నింగికేగి చూస్తూ
కన్నీటి చుక్కలే కారిన అందించే పసితనం రైతుది.
ఎండనకా, వాననకా రాత్రింబవళ్ళు కృషిచేసి
మెత్తటి పరుపులు విడిచి గడ్డి పాన్పు మీద
ఇక్కట్లే భారంగా మోస్తూ, భార్యాపిల్లలను కాచేడు
దునియ కడుపు నింపుటకొరకు దినదిన కష్టపడతాడు.
ఇంట్లో పస్తులు ఉండి ప్రజల ఆకలి తీర్చే అన్నదాత
గిట్టుబాటు ధరలు లేక ఉన్నదాంట్లో సంతోషం వెతికే
దాలరుల చేతిలో మోసపోతే మౌనంగా ఉండి
అంతా ఆ భగవంతుని మీద నమ్మకమే అతనికి శక్తి.
పెట్టుబడి ఎల్లక పారేశానులో కృషికుడు
కన్నిటి ధారులు తూడ్చ గుడ్డ కరువై
ప్రకృతి విపత్తులకు బలియయ్యే మొదటివాడు
రైతే రాజని అంటారు అది పేరుకే ఒట్టిమాటలు
ఏ ప్రభుత్వం వచ్చినా, ఎన్ని పథకాలు ఇచ్చినా
పంటకు రుణాలు అందించినా,
సబ్సిడీ విత్తనాలు వితరణ చేసినా...
ఇవన్నీ కావు రైతుకు గౌరవం కావాలి
చెమటోడ్చి పండించిన పంటకు గిట్టుబాటు
ధరలే మూలం
ఎటువంటి పరిస్థితిలో ఉన్న ఆత్మగౌరవం
ముఖ్యం
రైతును చూసి జాలిపడడం కాదు,
ఓ మంచి మాట చాలు మనసు విప్పి
మాట్లాడి చూడు
మమతను పంచే
ప్రకృతి ప్రేమికుడు మన రైతు.

-పడిగెల దేవిదాస్
నిర్మల్

### ధరిత్రీ పుత్రుడు!

అల నల్లన నీలి గగనాన
కారు మేఘాల గర్జనలతో
మయూరిలా రైతన్న హృదయం
గెంతులు వేసింది పరవశంతో..
ఏరువాక సాగించాలని
ఉరుకులు పరుగులు తీసింది
కర్షక హృదయం ఆనందంతో
దుక్కి దున్నింది.. నారుమడి వేసింది
బీజం చల్లింది.. ఎన్నో ఆశల కోర్కెలతో
పైరు పచ్చగా కళకళలాడాలని
రేయి పవలూ శ్రమించింది నిస్వార్థంగా..
నవ్వాయి పచ్చని చేలు పంటలతో
మురిసింది
రైతన్న హృదయం ఆనందంతో.;
అంతలోన
వచ్చాయి వరదలు పోటెత్తుతూ
కొట్టుకుపోయాయి రైతన్న బుగ్గల జారిన
కన్నీళ్లు
బురదలో కూరుకుపోతూ
కన్న కలలను కల్లంలో తేల్చేస్తూ
అప్పుల ఊబిలో నెట్టేస్తూ..
శ్రమ స్వేదంతో పండించిన రైతుకు
ఎన్నో నష్టాలు
ఆరుగాలం కష్టించిన రైతన్నకు
పంటకు దక్కని రేటు
దళారీల రాబందుల వలలో చిక్కిన
రైతన్న మరో దారి దొరకక మృత్యువుతో
పోరాడుతూ..
కల్పించాలి రైతన్నకు భరోసా
ఋణమాఫీలను అమలు పరుస్తూ
నకిలీ విత్తనాల సరఫరాని అరికడుతూ
ఎరువులు ధరలను నియంత్రిస్తూ
గిట్టుబాటు ధరలు కల్పిస్తూ
పాలకులు రైతన్నకు అండగా నిలవాలి
రైతన్నను దేశానికి వెన్నెముకగా భావించాలి
పుడమి తల్లి ముద్దు బిడ్డను కొలవాలి
తెలియాలి! రైతు లేనిదె రాజ్యం అనాథ
అయిపోతుందని
మనిషి మనుగడ సాగించటమె కష్టమని..

-పద్మావతి పి.
హైదరాబాద్

## కణిక





సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్:రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ
95021 56813



### అమరజీవీ నీకు నిరంతర జోహార్లు

ఉత్తర ప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస కుటుంబం.
షోయబుల్లాఖాన్ ను ఈ ప్రాంతానికి ప్రసాదించిన వరం.
ధన్యులు అతని తండ్రి హబీబుల్లాఖాన్, తల్లి లాయహున్నీసా బేగం.
నిష్కామ ప్రజా సేవలో మురిసింది షోయబుల్లాఖాన్ జర్నలిజం.
నిజాం తన రాజ్య ప్రజలను హింసిస్తూ ...
కోట్లాది రూపాయలను పాకిస్తాన్ కు ధారాదత్తం చేస్తూ ...
తనకి వ్యతిరేకంగా నడిపించే పత్రికలను మూసేస్తూ...
ధారుణాతి దారుణాలకు కారణమయ్యె నిరంకుశ పాలనలో.
తన కలంతో వాడిగా, వేడిని నింపి ప్రజా చైతన్యాన్ని రగిల్చి,
ఒక పత్రికను మూసేస్తే మరో పత్రిక ద్వారా పోరాడి,
చివరకు సొంత పత్రికను స్థైర్యాన్ని వదలక నడిపి,
ప్రాణాలను సహితం లెక్క చేయని పాత్రికేయుడు షోయబుల్లాఖాన్.
ఏడుగురు ముస్లిం పెద్దలు తయారుచేసె ఓ పత్రాన్ని.
నిజాం రాజ్యాన్ని భారత యూనియన్‌లో కలుపమని హితవు పలికె.
ఈ నిజాన్ని ఇమ్రోజ్ పత్రికలో యధాతథంగా షోయబుల్లా ఖాన్ చూపె.
భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిలో దాన్ని చూపి లాభపడె.
తన కలాన్ని షోయబుల్లా ఖాన్ ఆయుధంగా వాడె.
దేశంకోసం ధైర్య సాహసాలను చూపె.
కుట్రదారులకు తెలుసా నీతి నిజాయితీల విలువ!
ఆ దేశ భక్తుడిని హత్య చేశారే ...
అమరజీవీ అందుకో మా నిరంతర జోహార్లు

-విత్తనాల విజయకుమార్
9985117789

### ఆ క్షణం

నీ చిరునవ్వు చూసిన క్షణం
నా గుండె కొట్టుకోవడం మరిచిన క్షణం
ఆ చిరునవ్వులోనే నా కల దాగి ఉన్నదని తెలిసిన క్షణం
ఆ కలలోనే నీతో
నా జీవితం ఉంది అని తెలిసిన క్షణం మరువలేను చెలి..
ప్రతి ఉదయం నీ తలపుతోనే మొదలు
నువ్వు లేకుంటే ఆ ఉదయం చీకటనే నా దిగులు
కానరాక ఎందుకు గుండె గుబులు.
నీ కలలలో నేనున్నాననే ఆశ
నా కలలలో నువ్వే ఉన్నావనే శ్వాస
ఆశతోనే ఎదురుచూస్తున్నా
నువ్వు ఒక్క మాట చెబుతావని విశ్వాస
నీ ఆశ నేనైతే చాలు అని
అత్యశ నన్ను నిలవనీయులకున్నది సఖి.
చిరునవ్వుతో దోచావు
కలలోకి లాగావు
ఉదయం అంతా నీ ధ్యాసలోనే
రాతిరంతా నీ ఆశతోనే వేచి ఉన్న ప్రియ సఖి..

-సంధ్య జంగాల
92469 22626

### 'ఏ మతమైనా మానవత్వంతో పరిమళించాలి

మతం అంటే ఏమిటి..ఆత్మను తట్టి లేపే దివ్య మంత్రం
మానవత్వం అంటే ఏమిటి..ఆ మంత్రంలోని పరమార్థం..
మతమనేది..మనిషి మనసుకు వేసే వెలుగు బాట
మానవత్వమనేది ఆ బాటలో విరిసే కరుణ తోట..
దేవాలయ గంటలో భక్తి స్వరం వినిపిస్తుంది
ఆర్తజనుల గుండెలో దైవ స్వరం ప్రతిధ్వనిస్తుంది..
చర్చిలో ప్రార్థన చేస్తే..శాంతి దొరుకుతుంది
ఆకలితో ఉన్నవాడికి అన్నం పెడితే..మనకు మనశ్శాంతి లభిస్తుంది..
మసీదులో అజాన్ వింటే.. అల్లా గుర్తొస్తాడు
కష్టంలో ఉన్నవాడిని ఆదుకుంటే..అల్లా ఎదురొస్తాడు..
మతం మనకు నేర్పింది దేవుడిని పూజించమని
మానవత్వం మనకు నేర్పింది మనిషిని ప్రేమించమని,..
మత గ్రంథాలు చదివితే.. జ్ఞానం వస్తుంది
మనిషి కన్నీరు తుడిస్తే.. మోక్షం వస్తుంది..
కులం చూసి మనిషిని దూరం పెడితే అది మతం కాదు
గుణం చూసి మనిషిని దగ్గరకు తీస్తే అదే మానవత్వం..
రక్తం అందరిదీ ఎర్రగానే ఉంటుంది
కన్నీరు అందరిదీ ఉప్పగానే ఉంటుంది
మరి మతం పేరుతో మనుషులను విడదీయడం ఎందుకు..
దేవుడు ఒక్కడే పేర్లు మాత్రమే వేరు
మనిషి ఒక్కడే మతాలు మాత్రమే వేరు..
మతాన్ని మదిలో ఉంచుకుందాం
మానవత్వాన్ని ప్రపంచానికి పంచుదాం..
మతం మన వ్యక్తిగత నమ్మకం కావాలి
మానవత్వం మనందరి బతుకు కావాలి..!

-ముత్యం వెంకటేశ్వరరావు
79978 40591

### కులం కన్నా గుణం గొప్పది (మానవత్వం)

కులమతాల కుమ్ములాటలే
ధ్యేయం కొందరికి
పొట్టకూటి అగజాట్లే ఇంకొందరికి
మానవత్వాన్ని పరిమళింపజేయాలి
మనం ఎప్పటికి.....!
సృష్టికి జీవం పోసిన దేవుడు
ఒక్కడే కానీ మనుషులు గీసుకున్న
గీతలు ఎన్నెన్నో కులమంత ఒక కంచె
మతమంత ఒక గోడ
ఈ నడిమధ్యన నలిగిపోతోంది మానవత్వం
కులం కూడు పెట్టదు మతం మంచినీళ్లుఇవ్వదు సంస్కారమే
సాయం చేస్తుంద మమకారమే సహాయం చేస్తుంది
గాలికి లేదు కులం నేర్పు లేదు కులం చెట్టుకు లేదు కులం నేలకు
లేదు కులం మనుషులం మనకెందుకు ఈ కులం
ఈ భూలోకంలో ఎవరికి లేని కులం దేవుడి సృష్టించిన ఈ సంపదనకు
లేని కులం మానవజాతికి ఎందుకు కులం మతం గోడలను బద్దలు
కొడదాం సమాజాన్ని
మానవత్వం అనే రాయితో నిలబెడదాం

-దారా శ్రీకాంత్,9676059716

### అంకురం

విజయం సాధించాలనే గట్టి సంకల్పం
చీకటినైనా చీల్చుకొని ఎదురీది పయనిస్తుంది వెలుగు వైపు...
యాతనను అనుభవిస్తున్నా
ప్రాణాలకు తెగించి
ఓ జీవికి జన్మ నివ్వాలన్న తపన ఉన్న తల్లిలా...
హృదయం పిండేస్తున్నా
మెదడును తొలిచేస్తున్నా
మేధోమధనాన్ని చేసి కవి
హృదయం నుండి జాలువారే కవిత్వంలా...
కష్టాలను లెక్కచేయదు సంకల్ప బలం
ఆటంకాలను అధిగమించి
విజయం సాధించడమే దాని లక్ష్యం...
భూగర్భ చీకటిని చీల్చుకొని..
వెలుగు వైపు తొంగిచూసింది
నిటారుగా తలెత్తింది చిన్ని అంకురం...
ప్రాణవాయువును అందించడమే దాని పరమార్థం...

-నంద్యాల సరస్వతి
94904 82795

# కొప్పరపు తాయారు స్మారక పురస్కారాలు



పురస్కార గ్రహీతలతో అతిథులు.

ప్రముఖ విద్యావేత్త డా. పసుల లక్ష్మారెడ్డి, ప్రముఖ నటుడు వెంపటి కామేశ్వరరావులకు దర్పణం సాహిత్య వేదిక ఈ ఏడాది కొప్పరపు తాయారు స్మారక పురస్కారాలను అంద జేసింది. శుక్రవారం మధ్యాహ్నం రవీంద్ర భారతిలో దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షుడు డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు అధ్యక్షతన జరిగిన సభలో సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖ సాహితీ వేత్త డా.ఏనుగు నరసింహారెడ్డి ఆ ఇరువురికీ పురస్కారాలు అంద జేశారు.

ఈ పురస్కారం స్వీకరించిన పసుల లక్ష్మారెడ్డి విద్యాశాఖలో జిల్లా విద్యాధికారిగా, ప్రాంతీయ సంయుక్త సంచాలకునిగా పనిచేసి, అదనపు సంచాలకులుగా ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం హైకోర్టులో న్యాయవాదిగా పేద ప్రజలకు సేవ చేస్తున్నారు. ప్రజల గుండె చప్పుడును ప్రతిబింబిస్తూ 'నేటిమాట' పేరుతో సమకాలీన సమాజ చెడు పోకడలను పదునైన వ్యంగ్యంతో విమర్శించారు. ఇటీవల కాకతీయ విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేటు ప్రకటించింది. కొప్పరపు తాయారు స్మారక పురస్కార గ్రహీత వెంపటి కామేశ్వరరావు దూరదర్శన్ సీరియళ్లలో, స్టేజీ నాటకాల్లో నటి ంచారు. దూరదర్శన్, ఆకాశవాణి సంస్థల్లో క్యాజువల్ న్యూస్ రీడర్ గా పనిచేశారు. పలువురు సాహితీ వేత్తల రచన లకు గళాన్ని అందిస్తూ, వేయి కిపైగా కథలను, 14 నవలలను వినిపించారు. ప్రముఖ టీవీ ఛానల్ ప్రసారం చేసిన 'వికటకవి' కార్యక్రమం ద్వారా ఆయన గళం ప్రాచుర్యం పొందింది. ఈ పురస్కార ప్రదాన కార్యక్రమంలో ప్రముఖ కవి డా.అమ్మంగి వేణుగోపాల్, హైదరాబాదు బుక్ ఫెయిర్ పూర్వ అధ్యక్షులు డా. యాకూబ్, దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షుడు డా. సూర్యప్రకాశ్ రావు, సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.బాలాచారి, సెంట ర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జువ్వాడి దేవీప్రసాద్, పాఠశాల విద్య రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ సరోజినీదేవి, కవయిత్రి సత్యవీణ, కీ.శే.కొప్పరపు తాయా రు కుటుం బ సభ్యులు చంద్రమోహన్ రిష్యంత్, దర్పణం సాహిత్య వేదిక బాధ్యులు చీదెళ్ళ సీతా లక్ష్మి, రామకృష్ణ చంద్రమౌళి, గుండం మోహన్ రెడ్డి, నక్క హరికృష్ణ, ఇమ్మడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కలామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



సభలో మాట్లాడుతున్న నాయుడు సత్యనారాయణ, వేదికపై చొక్కాపు వెంకటరమణ, వెన్నెల సుబ్రహ్మణ్యం, కళా జనార్ధనమూర్తి, దేవసేన.

హైదరాబాద్, అక్టోబర్ 21: (నేటినిజం ప్రతినిధి): దేశ అత్యున్నత పదవి రాష్ట్రపతిగా ఉన్న సమయంలో కూడా నిరాడంబర జీవితం, నిస్వార్థ సేవా దృక్పథంతో గడిపిన మహావ్యక్తి అబ్దుల్ కలామ్ అని తెలంగాణ హస్త కళాభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఈ నెల 15న గురువారం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ జయంతి సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ, కలామ్ చిన్ననాటి నుంచి విద్యపై ఆసక్తి, చదువు పూర్తి చేసుకోవాలన్న తపనతో పేపర్‌బాయ్ వంటి పనులు కూడా చేస్తూ తాను అనుకున్న అంతరిక్ష రంగంలో ఉన్నత స్థాయికి చేరారన్నారు. ప్రతి ఒక్కరూ తమ రంగంలో ఉన్నతస్థాయికి చేరేందుకు కలామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

గాయకుడు వెన్నెల సుబ్రహ్మణ్యం, గానసభ సభ్యురాలు దేవసేన, బాలసాహిత్య రచయిత చొక్కాపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.





'దర్పణ స్వరాలు' ఆవిష్కరణ సభలో డా॥ ఏనుగు నరసింహారెడ్డి, అమ్మంగి వేణుగోపాల్, డా.రాయారావు సూర్యప్రకాశ్ రావు, డా.చీదెళ్ళ సీతాలక్ష్మి,సత్యవీణ మొండ్రేటి, రామకృష్ణ చంద్రమౌళి తదితరులు

# పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కరీంనగర్, అక్టోబర్ 21:: శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.

పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. ముందుగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. విధులను నిర్వహిస్తూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ గుర్తు చేశారు. పోలీస్ అమరుల త్యాగాలను వృథా కానివ్వకుండా, వారి స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా విధుల్లో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న నేర స్వరూపానికి అనుగుణంగా పోలీసులు సైతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, అతి తక్కువ వ్యవధిలో ఎంతో చాకచక్యంగా సైబర్ నేరాలను ఛేదిస్తూ, నేరస్థులను పట్టుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీ అంబటి నరసయ్య, సీఐలు వేణు, సత్యనారాయణ రెడ్డి, వెస్ట్ జోన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణంలో ఉన్న భవనంలో పేలుడు.. ఐఈడీగా పోలీసులు అనుమానం

బెంగళూరు, అక్టోబర్ 21: నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల బిల్డింగ్‌లో పేలుడు జరిగింది. ఈ సంఘటనలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఐఈడీ పేలినట్లు అనుమానిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. మంగళవారం పులకేశినగర్ ప్రాంతంలోని జార్మియా రోడ్డు వద్ద నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నివాస భవనం ఐదో అంతస్తులో పేలుడు జరిగింది. ఇద్దరు కార్మికులకు తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కాగా, ఆసుపత్రి వర్గాల ద్వారా ఈ పేలుడు సమాచారం పోలీసులకు తెలిసింది. దీంతో యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్), ఇంటర్నల్ సెక్యూరిటీ డివిజన్ (ఐఎస్డీ), బాంబు నిర్వీర్య దళానికి చెందిన అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ) పేలినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడ లభించిన పేలుడు వస్తువులను సేకరించారు. విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు.

అయితే ఫోరెన్సిక్ నివేదిక అందిన తర్వాతే ఆ పేలుడుకు కారణం ఏమిటన్నది తెలుస్తుందని కర్ణాటక హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు జరుగుతున్నదని మీడియాతో అన్నారు. ఆ భవనం కొంతవరకు వినియోగంలో ఉందని, మరికొంత భాగం నిర్మాణ దశలో ఉన్నట్లు వివరించారు.







మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి.

కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1911వ రోజు 'పండుగ షాపింగు- వేతనజీవుల తిప్పలు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'పండుగ షాపింగు- వేతనజీవుల తిప్పలు' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & నిర్వహణ

**డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు,**

9441046839

## అత్తెసరు బతుకులు

అత్తెసరు బతుకుల్లో
పండుగలకే కదా
కాస్త కమ్మగా తిందామని
కొత్తంగి తొడుక్కొని
తోటి వాళ్లతో కలిసిపోదామని
ఆశ పడేది.
ఉన్నవాళ్లకు లేదు పండుగ
విలువ లేని వాళ్లకు
పండుగ పూట పెద్ద గొడవ
కొత్త బట్టల కోసం ఎక్కితే
షాపు కడప
నెల జీతం సరిపోలేదు
కోక ఖరీదుకు
ఒక్క చొక్కా వస్తలేదు
సగం జీతానికి
ఒక్క పండుగకైనా
కుటుంబంలో అందరికీ
కొనలేని దుస్థితి
మధ్యతరగతి ప్రజలకు
ఉన్నంతలో సర్దుకుందామంటే
ఒప్పుకోరు కల్మషం లేని
కన్నపిల్లలు.
తీరొక్క రంగులతో తిరణాలు
చేస్తుంటే దుకాణాలు
చూపు చిక్కింది
చుక్కలో చేరింది దాని ధర
అందుకోలేక కూలబడింది
ఇంటి ఆర్థిక వ్యవస్థ
కోరికలు గుర్రాలైతే
కన్నీళ్లతో కళ్లెం వేయక
తప్పట్లేదు ఆశలకు
అప్పులు తెచ్చి
కొప్పులు పెట్టకుండా
పప్పు మెతుకులే
కడుపు నిండా తిని
ఉన్న బట్టలతోనే పండగ
చేసుకుని
సంతోషంగా జీవిస్తే ఆనందం
అవగాహన కలిగించుకోవాలి
కుటుంబ ఆర్థిక వ్యవస్థపై.
నెల జీతానికి ఏమెరుక
ధరల పట్టిక
రోజు కూలికి ఏమెరుక
ధరల నడక
సొమ్మసిల్లిపోతుంటే విన్నాక
పేద మధ్య తరగతి బతుకులకు
ఈ పండుగ
పప్పు కూడైనా
కడుపునిండా తినడానికే
పండగ ఆనవాళ్లను
మరువకుండా
చుట్టాలు-పక్కాలు
బంధుమిత్రులు
పేద మధ్య తరగతి వారికి
సిరులూ సంపద
సంప్రదాయాల సంస్కృతులు
మిగిలే పండగ గుర్తులు
బతుకులో పండుగ రూపాలు.

**-పొన్నాల ధనమ్మ**

## చిత్రగుప్తుడి మరణశాసనం

నాణాలుగా మారిన
చెమట చుక్కలు
అప్పుల చితిలో
ఎప్పటికప్పుడు ఆవిరి
దసరా ధరల పట్టిక
అర్థంకాని చిత్రగుప్తుడి
మరణశాసనంలా తోస్తుంది.
కొత్త చొక్కా ధరతో
నెల మొత్తపు జీతాన్ని
ఎంత కొలిచినా సరిపోలడం
లేదని
అద్దాల షాపుల్లో
అందాల ఆహ్వానాలు
చిల్లులు పడ్డ జేబులను చూసి
చీదరించుకుంటున్నాయి.
ఒకే ఒక్క కొత్త చీర
కట్టుకున్న ఆమె మనసులో
ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న
ఎదురురాని వసంతం
కడుపున పుట్టినవాడి బాల్యంలో
ఆశగా నిర్మించుకున్న స్వర్గం
కట్టాల్సిన ఇంటి అద్దె
తీర్చాల్సిన కిరాణా బాకీల
దెబ్బలకు
ప్రతి నెలా కుప్పకూలుతున్నాయి.
పిల్లల కలల
దుప్పటి చిరుగులు కుట్టలేక
మధ్యతరగతి నిద్రలేని రాత్రులు
చలికి వణుకుతున్నాయి.
ఆత్మ కార్చే రక్తాన్ని
నిస్సహాయంగా
కంటి నుంచి కార్చుకుంటూ
పాత చీరలకు
కొత్త అంచులు కుట్టుకుంటూ
చిరిగిన ఆశలను
మౌనంగా ముడివేసుకుంటూ
అప్పులకు అంతమూ లేదు
త్యాగాలకు ప్రకటనలూ లేవు.
కొట్టుకునే గుండెకే కాదు
కారే చెమటకూ సెలవులు లేవని
అర్థం చేసుకుంటూ
ప్రపంచాన్ని ధగధగ మెరిపించే
శ్రమజీవుల మసకబారిన జీవితాలు
ఎవరికీ కనిపించవని
వినిపించకుండా నసుక్కుంటూ
రావణుడి దిష్టిబొమ్మను
దహించేవారే కానీ
పండుగ ధరల పట్టికను
దించేవారెవరని
తమను తామే ప్రశ్నించుకుంటూ.
దుర్గమ్మకు మాత్రమే
ప్రతి సంవత్సరం విజయం
ప్రతి నెలా
ఖర్చుల రాక్షసితో పోరాడుతూ
నిరంతర మరణ బలిపీఠంపై
చచ్చి బతుకుతున్నాడు
ప్రతి మధ్యతరగతి మనిషి.

**-నాగరాజు చుండూరి**

## వేతన జీవులకు సంకటం

సందళ్లలో ఇక్కట్లు
దసరాలలో
గొప్ప తగ్గింపు ధరలు
కొన్న వాటికి
అదనపు ఉచితపు కానుకలు
రంగురంగుల ప్రచారాలు
అర్థంకాని షరతులు.
ఇంట్లో వారికివన్నీ ఆరక్షణలు
వద్దంటే యుద్ధ వాతావరణం
ఔనంటే గుండెలపైన
జేబులు గుభేలు.
జేబు రుమాలు
కొందామనుకుంటే
దుప్పటి కొనిపిస్తాడు
ఉన్నంతలో సర్దుకుని
కొందామంటే అరువిప్పిస్తాడు
అంతా
అమ్మేవారి మాయాజాలం.
ఇంట్లో వారికి అవసరమా! కాదా!
కాదు ముఖ్యం
ఇరుగుపొరుగుకు
చాటి చెప్పేందుకు
కావాలి వ్యయం.
ఇదొక ఇంట్లో
గెలవని రచ్చల ముచ్చట్ల
మురిసే షాపింగ్
మిత ఆదాయాల
వేతన జీవులకు సంకటం.
మిగతా అందరికీ చెలగాటం.

**-రాజప్ప**

## ఎండిన గుండె

పూర్వం
ముఖ్యమైన పండుగకు మాత్రమే
గుడ్డలు కొనేవాళ్ళు
అదే ఆనాటి గొప్ప షాపింగు
అదీ అమ్మా నాన్నల ఇష్టం
వారి రెక్కల కష్టానికి తగ్గట్టే
పండుగ వైభోగం
నేటి స్థితి పూర్తిగా తారుమారు
రోజూ ఒక కొత్త వస్తువు
కళ్ళచూడకపోతే
దిగదు ముద్ద చాలామందికి
ఇక పండగంటే
పడిందే వేటు
డిస్కౌంట్లు అంటు వ్యధిలా
అంటుకొని బాధిస్తుంటే
డబ్బు కౌంటింగు
గుర్తు రానీదే
అదేదో దిక్కుమాలిన కార్డు.
ఇక చూస్కో నా సామిరంగా
కుప్పలు కుప్పలు
చెప్పులు చేరు
కుప్పలు తెప్పలు
బట్టలు కూడా
బొట్టు పెట్టరు
అయినా కొనుగోలు
నగలనూ పెట్టరు
కొని లాకరుకు అలంకరణ
చిన్నాచితకా
చైనా జపాన్ సరుకులు
కారు డిక్కీ నిండా
పొద్దున వెళ్ళి
హోటల్ లో వేలు బిల్లు చెల్లించి
కొన్న సంచితమంతా
సంచుల కెత్తి
ఇల్లు చేరిన ఇల్లాలి మొహం
వేయి ఓట్ల కాంతి బల్బు
యజమాని బ్రెయిన్ స్విచ్ ఆఫ్
చేసిన ట్యూబ్ లైట్
వినరా చెప్పెద
వీరకుమారా
పండుగ దండుగ అనెడి
పలువిధ గాథలను తడికిట
తడికిట తోం
బుర్రను బాగా తోం.

**-డా.వసుంధర**

## పండగ పరేషాన్!

దసరా పండుగ షాపింగ్
పరేషాన్ తో ఎగిరే వేతనజీవి
పింగ్ పాంగ్!
పండగొచ్చెనయ్యో
గుండె గల్లంతాయె
హెచ్చులకు పోయి ఖర్చులు
అప్పుకై అరిగె చెప్పులు
ఆడోళ్ల మ్యాచింగులకు
తలపిన్ను
కాలిచెప్పులకే సగంజీతం
ఫటాఫట్!.
గట్క సంగటెందుకు
ఐదు నక్షత్రాల హోటళ్ల విందుతో
అప్పుజేసి పప్పుకూడు
డాక్టరు బిల్లులతో బేజారు.
బోనస్ కోసం
బాసు చుట్టూ చక్కర్లు
క్రెడిట్ కార్డుతో అజాపజా లేక
ఊడే వెంట్రుకలు
మిగిలే చలిమిడి ముద్ద గుండు
గూబగుయ్
అప్పులోళ్ల లొల్లితో
నోరు ముయ్!.
చేతిలో జీతం
పడడం ఆలస్యం
ఇల్లాలి చాంతాడంత లిస్టుతో
అప్పుచేసి పప్పన్నం ఎందుకు
సొప్పుతో ఆరోగ్యం ఆనందం
స్వీట్లు హాట్లు ఒక్క రోజు
అనుకోని ఖర్చులతో
ఆర్నెళ్లు గ్రహపాట్లు
పొదుపు మంత్రం నేర్వాలి
అదుపులో మనం ఉండాలి
గోసతో పండగ
యాష్టతో బతుకు దండగ.

**-ఎ.రాజ్యశ్రీ**



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం"లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం.. -సంపాదకులు

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

## నారాయణీయం

ఊరు చిన్నదే అయినా వయసుకు
ఊర్లో నివసిస్తున్న మనుషులు పెద్దమనసులు
సిద్ధిపేటకు ఊరికి మధ్య దూరం పదికిలోమీటర్లు
ఊరికి హైదరాబాద్ కు మధ్యదూరం నూటపది కిలోమీటర్లు
సిద్ధిపేట జిల్లా ఊరు పేరు రావురూకుల!
అన్ని ఊర్లకంటే మాఊరు గొప్పగా ఉండాలని ఊరందరి కల!
ఆ ఊరిలో ఒకేఒక్కడు!
ఆ ఠీవీ ఆ దర్జా ఒకే ఒక్కడు!
అతను కదిలితే ఊరుఊరంతా కదిలేది
అతను ఆగితే ఊరు ఊరంతా ఆగేది
ఆ ఊరికి ఆయన పోలీస్ పటేలు
గొర్ల మేకల మందకు మేక పొటేలు
ఊరికి తలలో నాలుకలా ఉండేవారాయన!
ఆయన పేరే లచ్చన్నారాయణ!.
అది సరదా దసరా పండుగ
తీరొక్క పువ్వులు పేర్చే బతుకమ్మల పండుగ
బతుకోసం ఊరొదిలి ఎక్కడికెక్కడికో వెళ్లినా
పండుగనాడు ప్రత్యక్షమయ్యేవారు
ప్రతి ఒక్కరు కొత్త బట్టలేసుకుని జంబికి పొయ్యేవారు
ముద్దబంతి పువ్వులోలే ఆడోళ్ళు
బతుకమ్మలెత్తుకొని బయలుదేరేటోళ్లు
బతుకమ్మ పాటలు పాడుతూ ఆడుతూ ఆడోళ్ళు
వెనుక సద్దులెత్తుకొని వచ్చేటోళ్లు మొగోళ్ళు
ఊరు ఊరంతా ఊరేగింపుగా కదిలేది !
దసరా పండుగ నాడు సాయంత్రం
పాలపిట్టలకోసం చెరువు కట్ట ఎక్కేవాళ్లు
తుపాకీ తో పోలీస్ పటేల్ ముందు నడుస్తుంటే
వెనుక ఊరంతా సైనికుల్లా బయలుదేరేవాళ్ళు
చెరువు నిండినపుడు కట్టమీద నడుస్తుంటే
చెరువు నీళ్లు పొంగి వస్తున్నట్టుకనబడేది!
మీదిమీదికి చెరువు పొంగి వస్తుందనో
పటేల్ తనచేతి తుపాకిదెబ్బ వినిపించాలనో
చేపలున్న చెరువులోకి తుపాకీ మోగేది!
చెరువు గట్టుమీదున్న చెట్లమీద కొంగలూ పాలపిట్టలూ
బుల్లి విమానాలై రెక్కలిప్పి
ఆకాశం మీదికి టేకాఫ్ చేసేవి
పాలపిట్టల్ని చూసి చప్పట్లు కొట్టేవాళ్ళు
ఒకరినొకరు అలాయ్ బలాయ్ చేసుకొనేటోళ్లు
ఊరు ఊరంతా ఒక్కతాటి మీద
నడుపగల శక్తి నారాయణ కుండేది
తెల్లని అంగీ ధోతి కట్టుకున్నఆయన ఆకారం!
ముసిముసి నవ్వుల నగుమోమే ఆయన మమకారం!
గంభీరమైన విగ్రహం!
మనసెంతో నిగ్రహం!
ఆ ఇద్దరాలుమొగలు నడుచుకుంటూపోతుంటే
ఊరంతా జనం మురిసిపోయేటోళ్లు
రావురూకుల సర్పంచ్ అవడానికి ఆయనకు
అవకాశం వచ్చినా దానికోసం అర్రులు చాచలేదు
కాలం గిర్రున ఇన్నాళ్లు గడిచి పోయింది
గతాన్ని తలుచుకొని నెమరువేసుకొనుడైంది
ఇప్పుడు మన మధ్యలో వాళ్లిద్దరూ లేరు
ఆ భార్యాభర్తలు ఇద్దరూ స్వర్గస్థులైనా
ఊరందరి హృదయాల్లో కదులుతున్నారు !
కొడుకులు కోడళ్ల కళ్ళల్లో మెదులుతున్నారు !!
ఊరవతల చెలకలో విగ్రహాలై బతుకుతున్నారు !!.

**-కందుకూరి శ్రీరాములు**
9440119245

## "బంద్" కు అన్నీ బంధీ!!

బంద్ జరుగుతోంది!!
ఆటంకం లేకుండా
నిరాటంకంగా బంద్ !.
బస్సులకు బ్రేకులు పడ్డాయి !
ట్రైన్లకు విశ్రాంతి!
ప్రయాణికులు ఉన్న చోటే
గమ్యం మాట రేపు ఎరుగు !.
బడికి బంద్ బెల్ మోగింది !
విద్యార్థులు కేకులు తిన్నట్లే కేకలు వేసుకుంటూ
ఇంటి దారి చదువు గోదారి!.
హోటల్లో అన్నీ చిందర వందరగా గందరగోళం!
ఆహార పదార్థాలు సకలం నేల పాలు
బంద్ సందర్భం కుక్కలకు విందు భోజనం!.
ఆగిపోయిన అంబులెన్సులు
అంబులెన్సులో యమభటులు.
నిరసనకారులు కార్లనూ ఆపేసారు!
షాపుల షెట్టర్లను కిందకు లాగారు
లూటీకి అనుకూల వాతావరణం !
టి వి "ఛా"నల్లకు పునశ్చరణలు.
బంద్ విజయవంతం అంటూ నిరసనకారుల ఆనందం !
ప్రజాస్వామ్యంలో ప్రజలకు బంద్ అనుకోని అసౌకర్యం
బంద్ కు అన్నీ బంద్!
బంద్ అంతటా మంట మంట
దేశంలో ఎప్పుడూ ఎక్కడో ఓచోట బంద్ ఉత్సవం
జనానికి జబర్ దస్తీగా నీరసం!

**-కందాళై రాఘవాచార్య**
87905 93638

## ఆకలి కాలం

ఉదయం పూట
తలుపులు తీసినా,మూసినా
మా ముంగిలిలో వినిపిస్తున్నది
మ్యావ్ మ్యావ్ స్వరాల పాట
పిల్లికినేను కనబడితే సంబరం
నేను బయటకు బయలుదేరితే
సంక్షోభమే
పిల్లా లేడిపిల్లలా చలాకితనం
సందులోగొందులో
అది అదృశ్యమైతే
మ్యావ్ మ్యావ్ అని నేను అరుస్తే
క్షణంలో ప్రత్యక్షమవుతున్న
బిడాలంతో
ఏనాటిదో ఈ మూగబంధం
విడదీయరాని అనురాగబంధం
మ్యావ్ మ్యావ్ అంటూ
ముద్దుముద్దుగా
అరుస్తున్న అందాల మార్జాలం
బేల కళ్లతో
ఆకలి చూపులైన కాలం
పాల కోసం ప్రాణం కోసం
వొలకబోస్తుంది కళ్ల నిండా
వొళ్లంతా మమకారం
వాకిలే దాని నివాసం
వాడలే దాని ప్రవాసం
చిట్టి స్టీలుగిన్నెలో
పోసిన మా పాలు
దాని పాలయిన క్షణం
ఆకలిముందు తోకే కాదు
తొంభై ఆరు కళలూ ముడ్చుకోవు
పాలు తాగిన ఆనందం
తనువంతా తన్మయత్వం
పిల్లి ముద్దుమురిపాలు
మృదుమధుర స్వరాలు
పిల్లి పసిపిల్లలా పరవశిస్తది
ప్రేమగా పరిమళిస్తది
కళ్లు మూస్తూ ఒళ్లు విరుస్తూ
సమంతలా డొక్క చాస్తూ
తోక ఆడిస్తూ నాలుక చాస్తూ
నా చెంతకు చేరి
కాళ్ల సందుల్లోంచి దూరి
నా చుట్టూ ప్రదక్షిణచేస్తది
నా కాళ్లను ,మోకాళ్లను
నానా విధాలు
ప్రేమతో,గారాబంగా నిమురుతూ
మ్యావ్ మ్యావ్ అంటూ శబ్దిస్తూ
కళ్లతో కవిత్వమేదో చెబుతుంది
రోజూదాని ఆకలీ, అ
నురాగం తప్ప, దాని భాషలోని
ఒక్క అక్షరంముక్క అర్థం కాని
మట్టి బుర్ర నాది.
గిన్నెడి పాలకే
పిల్లికిఇంత విశ్వాసమా ?
మ్యావ్ మ్యావ్ అంటే
మమకారం,విశ్వాసం అనుకుంటా
మ్యావ్ మ్యావ్ అంటే
మనిషి అవి విడిచాడని
అరుస్తుందనుకుంటా
నిశ్చలత్వం దేనికుంది ఇప్పుడూ
పిల్లి మనసే కాదు,
మకాం మారవచ్చు
వర్తమానం జ్ఞాపకంగా
రూపాంతరం చెందవచ్చు
దాని ,ప్రేమవిశ్వాసాలు
నా స్మృతి పథంలో
జీవిస్తాయి శాశ్వతంగా.

**-రమేశ్ నల్లగొండ**

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.